ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 16 మే 2026 | Saturday 16 May 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 49 | Vol.No 28 Issue No .49 | www.visionandhra.in

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

- సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి



హైదరాబాద్,మే15 :ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మిగతా2లో..

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

- రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్,మే15 : హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు మిగతా2లో..

## పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం




న్యూఢిల్లీ,మే15 : ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. మిగతా2లో..

## పెట్రో ధరల పెంపు అనివార్యం

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,మే15 : పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి మిగతా2లో..

## పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

- సిటీసివిల్ కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్



హైదరాబాద్,మే15 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, మిగతా2లో..

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

- ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,మే15 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం మిగతా2లో..



## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

### డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం

హైదరాబాద్,మే15: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా మిగతా2లో..

## జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ,
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు,
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం అని వెల్లడి




సంగారెడ్డి,మే15 : తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగరపల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. మిగతా2లో..

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

- జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు
- వివరాలు వెల్లడించిన ఎన్‌టిఎ




న్యూఢిల్లీ,మే15 : ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మిగతా2లో..

## నీట్ పేపర్ లీక్ సూత్రధారి కులకర్ణి

- ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ



న్యూఢిల్లీ,మే15 : నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రొఫెసర్ పి.వి.కులకర్ణిని సీబీఐ అరెస్టు చేసింది. మిగతా2లో..

## ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

- నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన
- ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న



న్యూఢిల్లీ,మే15 : నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు మిగతా2లో..

# దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

- రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్
- ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది
- జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి
- అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- దేశ అభివృద్ధిలో ఇక ఏపి కీలక భూమి అన్న చంద్రబాబు





పుట్టపర్తి,మే15 : దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే మిగతా2లో..

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా పురోగతి

పుట్టపర్తి పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్



పుట్టపర్తి,మే15 : యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ మిగతా2లో..

## ఉన్నత విద్యారంగం బలోపేతానికి చర్యలు

- యూనివర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ
- విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ వెల్లడి



మిగతా2లో..

## ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం

- ఒంటరి పోరాటం చేసి దెబ్బతిన్న విషయం మరవద్దు
- పార్టీ శ్రేణులతో జనసేనాని పవన్ కళ్యాణ్
- పార్టీ సభ్యత్వం అంటే జనసేన ఆశయాలకు అద్దం
- ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాల లక్ష్యం
- పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది
- పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్




అమరావతి,మే15 :ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు మిగతా2లో..

## ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

- ప్రధాని మోడీకి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు



అమరావతి,మే15 : శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మిగతా2లో..

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఅం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

## పెట్రో ధరల పెంపు అనివార్యం

జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైన దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది.

## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్ఛారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

## జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

## 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న

లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు..

2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్ఎ÷-లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానొక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.

## ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు

రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి - కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని

తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యారంగం బలోపేతానికి చర్యలు

అమరావతి,మే15 : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం మరో ముందడుగు వేస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 19 యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీ వర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అందుకు సంబంధించిన నియామకాల నోటిఫికేషన్ ఈ రోజు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1,020.. అసోసియేట్ ప్రొఫెసర్లు 334 పోస్టులు.. ప్రొఫెసర్లు 63, లెక్చరర్లు 104 సహా 279 బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు వివరించారు. ఈ నియామకాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకి అదనపు వెయిటేజ్ వర్తింప చేస్తామని లోకేశ్ తెలిపారు. మే 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి మరో ముందడుగు అవుతుందని

ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 4,343 పోస్టులకు గాను ప్రస్తుతం 972 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారని ఆయన సోదాహరణగా వివరించారు. అకడమిక్ ఎక్సలెన్స్, రీసెర్చ్, ఇన్నోవేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎన్ఏఏసీ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదల లక్ష్యంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. పారదర్శక, ప్రతిభ ఆధారంగా ఈ నియామక పక్రియ చేపడతామని వివరించారు. వివరాలను వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మరిన్ని వివరాలు అందులోనే ఉంటాయని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశమిదేనని ఆయన అభివర్ణించారు. సమయ పాలనతో ఈ నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా వివరాలను వెల్లడించారు.

## ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం

తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమ ఆత్మీయ సమావేశం' నిర్వహించారు. ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. నేనూ రెండు చోట్లా ఓడిపోయా. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలే. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు.

కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేవలం ఒక సంఖ్య కాదని, అది పార్టీ విలువలను, అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక గొప్ప యజ్ఞమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జనసైనికులను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని, పార్టీ ఇస్తున్న భరోసాను ఆయన వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై నాదెండ్ల మనోహర్ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత జనసైనికులు ఎంతో బలంగా నిలబడి 12 లక్షల 12 వేల సభ్యత్వాలు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయిలో జనసైనికుల కృషి వల్ల ఇప్పటికే 21 లక్షల 50 వేల సభ్యత్వాలు పూర్తి కావడం విశేషమని ఆయన కొనియాడారు.

## ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది.ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ / ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు - సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

# నీట్ పేపర్ లీక్ సూత్రధారి కులకర్ణి

నిందితుడిని పుణెకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా గుర్తించిన అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తరఫున పరీక్ష పక్రియలో కొన్నేళ్లుగా కులకర్ణి పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశ్నపత్రాలను పొందే అవకాశం అతనికి దొరికింది. ఏప్రిల్ చివరి వారంలో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సహాయంతో నిందితుడు పేపర్ లీక్ కుట్రకు పాల్పడినట్లు సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలోని పుణెలో తన నివాసంలో ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులను కులకర్ణి నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. మనీషా సహాయంతో పలువురు విద్యార్థులను సమీకరించి వారికి రహస్యంగా కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసినట్లు ఆరోపించారు. ఈ తరగతుల్లోనే ప్రశ్నలు, సరైన జవాబులను విద్యార్థులకు చెప్పారని అధికారులు తెలిపారు. ఆ ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రాల్లో వచ్చాయని వెల్లడించారు. దీంతో మే 14న మనీషాను అరెస్టు చేయగా.. తాజాగా కులకర్ణిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహల్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఏడుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిలో ఐదుగురిని ఇప్పటికే కోర్టులో హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. గురువారం అరెస్టయిన మిగిలిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ రిమాండ్ నిమిత్తం పుణెలోని కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ కోసం ఆ ఇద్దరినీ ఢిల్లీకి తరలించనున్నారు.

## KGBVవిద్యాలయం ఆదనపు మౌలిక వసతుల సదుపాయాల శంకుస్థాపన చేసిన ఎంపి జి నగేష్ ,ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా,మే 15,(విజన్ ఆంధ్ర);/ లక్ష్మణ చందా మండల కేంద్రం లో నాబార్డ్ నిధులతో నిర్మించిన KGBV విద్యాలయం ఆదనపు మౌలిక వసతుల భావన సదుపాయాల శంకుస్థాపన ఎంపి జి. నగేష్ గారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గారు చేశారు.!!/ ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నార

## మామడ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ జీ. నగేష్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా,మే 15,(విజన్ ఆంధ్ర);ఈరోజు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ గోడం నగేష్ గారు నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారితో కలిసి మామడ మండలంలోని పలు గ్రామాల కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు!!ఈ కార్యక్రమంలో వారితో నాయకులు గాదె శంకర్ స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత, జవాబుదారీతనం

## రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి

### - ఆర్.టీ.ఐ చట్టంపై పీఐఓలు, ఏపీఐఓలకు అవగాహన సదస్సు

నిజామాబాద్, మే 15 :( విజన్ ఆంధ్ర) ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం – 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉ ద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్ళు, 6 చాప్టర్లు, 31 సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సంబంధించి పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓల సందేహాలను నివృత్తి చేశారు. థర్డ్ పార్టీ ఇన్ఫర్మేషన్, వ్యక్తిగతంగా అడిగే సమాచారం, ఇవ్వవలసిన సమాచారం, ఇవ్వకూడని సమాచారం, తదితర వాటి గురించి సవివరంగా



తెలియజేశారు ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాచార చట్టం ప్రకారం సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరునికి ఉండడంతో పాటు, రికార్డులను, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అధికారం కూడా ఉందని తెలిపారు. పౌరులు కోరినప్పుడే సమాచారం ఇవ్వడం కాకుండా, సమాచార హక్కు చట్టం, సెక్షన్ 4(1) ప్రకారం స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చేలా అధికార యంత్రంగాలు సమాయత్తం కావాలని సూచించారు. పబ్లిక్ అథారిటీ బాధ్యతలు, విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరుకున్న సమాచారాన్ని పొందే అవకాశం ఉన్నందున పిఐఓలు, అధికార యంత్రంగాలు ప్రజల పక్షాన ఆలోచించి అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు భారతదేశంలో అమలు చేస్తున్న వివరాలు తెలియజేస్తూ అధికార యంత్రంగాలు, పిఐఓలు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 1766 లోనే స్వీడన్ దేశంలో సమాచార హక్కు చట్టం అమలు ప్రారంభమైందని, 2005 సంవత్సరంలో భారతదేశంలో ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచ దేశాల పరంగా చూస్తే ఆర్.టీ.ఐ అమలు విషయంలో భారతదేశం 4వ స్థానంలో ఉందని, దీని అమలును మరింత సమర్ధవంతంగా చేస్తూ మన దేశాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాచార కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం అమలు, ఉద్దేశ్యాలు, 4(1)ఎ కింద ఇచ్చే సమాచారం తెలియజేస్తూ ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో వివరాలను అప్డేట్ చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగాలపై ఉందని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని 6(3) కింద దరఖాస్తును చక్కగా చదివి ఆకళింపు చేసుకోవాలని, ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సరైన రీతిలో స్పందిస్తే సెకండ్ అప్పిలేట్ అథారిటీ వరకు అప్పీల్స్ అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులు అనగానే అనేక మంది ఆందోళనకు గురి అవుతారని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు గురి కాకుండా దరఖాస్తుదారు కోరిన మేరకు రికార్డులలో ఉన్న సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ కేసులను ఆర్.టీ.ఐ కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు పరిశీలించి పరిష్కరించారు. కాగా, సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థ్ విక్రం సింగ్, అదనపు డీ.సీ.పీ ప్రకాశ్, డీ.ఆర్.ఓ బి.గీత, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యశోద లో కోమా పేషెంట్ కు అరుదైన శస్త్ర చికిత్స ప్రాణాలు కాపాడిన ప్రముఖ వైద్యులు

### -వివరాలు వెల్లడించిన ప్రముఖ న్యూరో సర్జన్ కె ఎస్ కిరణ్

నిజామాబాద్ మే15:( విజన్ ఆంధ్ర) రోడ్డు ప్రమాదానికి గురై కోమాలో ఉన్న పేషెంట్ కు సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రి లో అరుదైన శస్త్ర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలను యశోద ఆసుపత్రి ప్రముఖ న్యూరో సర్జన్ కె ఎస్ కిరణ్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కె ఎస్ కిరణ్ మాట్లాడుతూ శస్త్ర చికిత్స సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి చెందిన సుద్దులం గ్రామ నివాసి 35 సంవత్సరాల జక్కు ప్రశాంత్ గత సెప్టెంబర్ మాసంలో విధులు నిర్వహించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డుపైన కుక్క అడ్డం వచ్చి కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలై కోమలోకి వెళ్లాడన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకువచ్చారన్నారు. రెండు నెలలు కొమలో ఉన్న పేషెంట్ ని అత్యాధునిక పరికరాలతోటీ సి డి , (ట్రాన్స్ క్లీనల్ డాప్లర్,) ఐ సి పీఎం(ఇంట్రా క్రినల్ ప్రెషర్ మానిటరింగ్ ) ఎం ఆర్ ఐ, డీ టి ఐ , ఇమేజెస్ అండ్ పర్ఫ్యూజన్ స్కామ్స్ పలు రకాల శస్త్ర చికిత్సలు




నిర్వహించడం జరిగిందన్నారు. రెండు నెలల చికిత్స అనంతరం రోగి సంపూర్ణ ఆరోగ్యంగా బయటపడ్డారన్నారు. గ్రేడ్ త్రి హెడ్ ఇంజురీ కారణంగా పేషంటు ప్రమాదం జరిగిన వెంటనే కోమలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రేడ్ వన్, గ్రేడ్ 2 ప్రమాదాలు స్వల్ప గాయాలతో ప్రాణాపాయ స్థితి నుండి బయట పడవచ్చని గ్రేట్ త్రీ వల్ల అత్యంత ప్రమాదకరం కావడంతో అత్యాధునిక పరికరాలతో చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రయాణం చేస్తే ప్రమాదం జరిగిన ఎలాంటి ప్రాణహాని ఉండదన్నారు. అనంతరం పేషంట్ ప్రశాంత్ మాట్లాడుతూ, తనకు పునర్జన్మ ని ఇచ్చిన డాక్టర్ కె. ఎస్ కిరణ్ తనకు దైవంతో సమానం అన్నారు. తన ప్రాణాలు కాపాడిన డాక్టర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ శ్రీరామ్ సురేష్ పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు పర్వతగిరి మండల ఆర్యవైశ్య సంఘం ఆర్థిక సహాయం అందజేత

వరంగల్ జిల్లా ప్రతినిధి మే15(విజన్ ఆంధ్ర);–వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రంలోని మండల ఆర్యవైశ్య సంఘం కన్యకా పరమేశ్వరి పరపతి సంఘం ఆధ్వర్యంలో ఇంటర్ మరియు ఎస్ఎస్సిలో మెరిట్ వచ్చిన ఆర్యవైశ్య కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు దారం పూర్ణ చందర్ మాట్లాడుతూ పర్వతగిరి మండలంలోని ధర్మిని శ్రీనివాస్ దర్మిని కరుణల కుమార్తె రిత్విక కు 7400 రూపాయలు అందజేశారు. అదేవిధంగా ఎస్ఎస్సి లో మెరిట్ కనపరిచిన దారం ప్రణవ్ కుమార్ 4116 నగదు అందించినట్లు తెలిపారు. పరపతి సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి బిక్షపతి సెక్రెటరీ చందా శ్రీనివాసులు ఆ విద్యార్థులకు షీల్డ్ ను బహుకరించి సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ రిటైర్డ్ విద్యావేత్త జి.స్వయం ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంఘానికి గర్వకారణం



అని కొనియాడారు. కల్లెడ గ్రామానికి చెందిన చిదురాల కోటిలింగం కుమారుడు చిదురాల శ్రీనివాస్ 5116 లను ప్రత్యేకంగా విద్యార్థి రిత్వికకు అందజేశారు. అదేవిధంగా ఆర్యవైశ్య సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయవంతం చేసే ముఖ్యులు పర్వతగిరి గ్రామ అధ్యక్షుడు దారం రామచందర్ కు దుబ్బరాజుకు ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండలం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రతినిధులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బీ ఆర్ఎస్ మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలి

### - మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి

మల్కాజిగిరి, మే 15,(విజన్ ఆంధ్ర): రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని మల్కాజిగిరి మర్రి రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మల్కాజిగిరి నియోజక వర్గంలోని 192 అల్వాల్, 193 వెంకటాపురం డివిజన్ లలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ ఎస్ బలోపేతానికి మరింతగా శ్రమించాలని సూచించారు. కార్యకర్తల మధ్య భేదాభిప్రాయం లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయడం, అలాగే సర్ (ఎ×=) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమిష్టిగా



ముందుకు వెళ్ళా లని ఆయన పిలుపునిచ్చా రు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎంబీసి కార్పొరేషన్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీరేష్ యాదవ్, వెంకన్న, ఖలీల్, లడ్డు, ఢిల్లీ పరమేష్, సుధీర్, శరన్ గిరి, విఎన్ రాజు, రాజేందర్, శ్రీనివాస్, లోకేష్, మురళి, సాజిత్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం

-వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో ఉదయనిధి స్టాలిన్ పై పిర్యాదు
-సనాతన ధర్మీయులారా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేయండి
- సనాతన ధర్మం పట్ల అవమానకరమైన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 15 ( విజన్ ఆంధ్ర ) : ఉదయనిధి స్టాలిన్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు. మనోభావాలను దెబ్బతీసేలా అభ్యంతరకరమైన అవమానకరమైన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను ఖండిస్తూ అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమిళనాడు శాసనసభలో డీఎంకే ఎమ్మెల్యే శాసనసభాపక్ష



నాయకుడు ఉదయనిధి స్టాలిన్ ఆరోపించబడిన కొన్ని బహిరంగ వ్యాఖ్యలు అభ్యంతరకరమని ఆయన ధ్వజమెత్తారు. సనాతన ధర్మాన్ని అనుసరించే లక్షలాది మంది అనుచరులు ఆచరణకర్తల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి. సనాతన ధర్మాన్ని "మలేరియా "డెంగ్యూ"లతో పోల్చారని ఆయన గుర్తు చేశారు. సనాతన ధర్మం కోట్లాది మంది భారతీయులు అనుసరించే ఒక ప్రాచీన ఆధ్యాత్మిక సాంస్కృతిక సంప్రదాయమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మీయులు సుధాకర్ ఆచారి, రాములు, లక్ష్మణ్, తడకల మోహన్ రెడ్డి, మాదవి, రాఘవేందర్, ప్రవీణ్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో అధికారులకు ప్రజలు సహకరించాలి

### హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,మే 15,(విజన్ ఆంధ్ర); జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ జాబితా తయారీకి జనగణన సిబ్బందికి, ప్రజలంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు నందు, జనగణనలో భాగంగా, తన నివాసానికి సంబంధించి, హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ భవేశ్ మిశ్రా పూర్తి చేసుకున్నారు. ముందుగా తాను ఆన్ లైన్ లో పూర్తి చేసుకున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలు, జనగణన సిబ్బందికి తెలియజేశారు. ఆ వివరాల ఆధారంగా, అధికారులు కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ నివాస గృహ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వారిలో సూపర్వైజర్ బి. రాజేందర్,



ఎన్యుమరేటర్ లు హిమబిందు, నాగలత, తదితరులు ఉన్నారు

## సకాలంలో జారీకాని సర్టిఫికెట్లతో విద్యార్థులు యాతన...!

-మల్కాజిగిరి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు
-ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని
-విద్యార్థుల వినతి

మల్కాజిగిరి, మే 15, (విజన్ఆంధ్ర): మల్కాజిగిరి మండల పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు సకాలంలో జారీ కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీని సులభతరం చేసినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ సంకల్పం ఆచరణలో నెరవేరడం లేదు.ఆదాయం, కులం వంటి అనేక సర్టిఫికెట్లు జారీచేయాల్సిన సంబంధితఅధికారులు కాలయాపన చేయడంతో విద్యార్థులు,నిరుద్యోగులు మల్కాజిగిరి మండల తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేకంగా ఆన్ లైన్ విధానంప్రవేశపెట్టినప్పటికీ, క్షేత్రస్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు అధికారులువిధుల పట్ల నిర్లక్ష్యం వల్ల 7 రోజుల్లో సర్టిఫికెట్ లు జారీలో మరింత అలస్యం జరుగుతోంది.తహసిల్దార్ కార్యాలయ ఉద్యోగులతీరుతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సిన




పరిస్థితిఏర్పడింది. కొంతమందికి దరఖాస్తులు కార్యాలయం లో దొరకకపోవడం గమనార్హం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న కాలయాపనను గుర్తించి సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేయాలని దరఖాస్తుదారులుకోరుతున్నారు. కింది స్థాయి సిబ్బంది అవినీతి వల్ల సర్టిఫికెట్లు జారీలో ఆలస్యం అవుతోందని దీంతో తాము ప్రతిరోజు తహసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందనీ దరఖాస్తుదారులు వాపోయారు. ఇకనైనా మల్కాజిగిరి మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులు పని తీరు,ఆమ్యామ్యాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి కళాశాలలు తెరవక ముందే సర్టిఫికెట్లు జారీ జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

## 128 కేజీల గంజాయి పట్టుకున్న పోలీసులు

### ముగ్గురు అంతర్రాష్ట్ర నిందుతులు అరెస్టు

ఖమ్మం క్రైమ్, మే 15( జనం సాక్షి) వైరా ఏసీపీ సారంగపాణి. వివరించిన సమాచారం మేరకు శుక్రవారం వైరా ఎస్ఐ రామారావు తన సిబ్బందితో కలిసి వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామం వద్ద అంజనేయస్వామి దేవాలయం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించేందుకు వెళ్తుండగా, రోడ్డుపక్కన ఐదు గోనె సంచులతో అనుమానాస్పదంగా నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు.వారిని తనిఖీ చేయగా, ఐదు గోనె సంచులలో మొత్తం 60 ప్యాకెట్లలో సుమారు 64 లక్షల రూపాయల విలువ చేసే 128 కిలోల ఎండు గంజాయిని ఒరిస్సా లోని మల్కనగిరి ప్రాంతం నుండి తమిళనాడు కు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం, రవాణా, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై ఖమ్మం కమిషనరేట్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని ప్రజలను కోరుతున్నారు.

## వచ్చే ఏడాది నీట్ ఆన్లైన్ పరీక్షలీకేజీని అరికట్టేందుకు చర్యలు

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే15: నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్లైన్లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

## దొడగుంటపల్లి మత్స్య సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ ఏకగ్రీవ ఎన్నిక



వనపర్తి జిల్లా ప్రతినిధి,మే 15 (విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లా మండల పరిధిలోని దొడగుంటపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ (తండ్రి చెన్నప్ప) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి కవిత ఆధ్వర్యంలో గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ భవనంలో ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ,నూతన కార్యవర్గం వివరాలు ,ఎన్నికల అధికారి సమక్షంలో సభ్యులందరి అంగీకారంతో ఈ క్రింది వారు వివిధ పదవులకు ఎంపికయ్యారు.,అధ్యక్షుడు జంగం గోపాల్ ,ఉపాధ్యక్షుడు బూసని శ్రీకాంత్కార్యదర్శి కె. కృష్ణయ్య ,కోశాధికారి నందమోని వెంకటయ్య ,ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కవిత నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘం సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగన్న, తిరుపతయ్య, పెద్ద నాగరాజు, చిన్న గోపాల్, ఆంజనేయులు, బి. ఆంజనేయులు, చిన్న రాములు, చెన్నారాయుడు, కురుమన్న, కురుమయ్య, రాజశేఖర్, సైదులు, శ్రీనివాసులు, బి. సైదులు, డి. కృష్ణ, జంగం నాగరాజు, జేబి రాములు తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# మంచి ఆలోచనతో అడుగేయాలి :నిధులకు కొరత లేదు

**-జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**"జలధార జల హారతి - సాగునీటి సంరక్షణ"**

**లో భాగంగా మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె,**

**-శెట్టివారిపల్లె చెరువుల అభివృద్ధి పనులకు శ్రీకారం**



మైదుకూరు,మే15 (విజన్ ఆంధ్ర): మంచి ఆలోచన, చక్కటి ప్రణాళికతో అడుగు ముందుకేయాలే గానీ జిల్లాలో అభివృద్ధి పనులకు ఈ మాత్రం నిధుల కొరత లేదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం "జలధార జల హారతి - సాగునీటి సంరక్షణ" లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోకలిసి మైదుకూరు మండలం శెట్టివారిపల్లె చెరువుకు నీరందించే పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జలమే సంపద. దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించ వచ్చున్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత" లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం చేయపట్టడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని. నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామపంచాయతీలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో చక్కటి ప్రణాళికలతో జలాధార కార్యక్రమం ద్వారా భూగర్భజలాలను సంరక్షించి. సాగునీటి కొరతను తీర్చే పనులు జరుగుతున్నాయన్నారు. జలాధార కార్యక్రమంలో భాగంగా. ముదిరెడ్డిపల్లె అభివృద్ధికి రణాళికలు సిద్ధం చేయడంతో అటు శెట్టివారిపల్లె చెరువుకు ఎస్.ఆర్.1, 2 కాలువల అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ చెరువుకు నీరందితే ఆయకట్టు ప్రాంత రైతులకు ఎలాంటి సాగునీటి కష్టాలు వుండవన్నారు. రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు. రైతు ఆలోచనలో మార్పు వస్తేనే లాభాల బాటలో నడవగలడన్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ.. ఆదాయంలో స్థిరత్వాన్ని అందించేవి ఉద్యాన పంటలే అన్నారు. అధిక తక్కువ నీటి ఖర్చుతో అధిక దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగుపై మొగ్గుచూపాలన్నారు. విద్యా విషయానికి వస్తే.. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చక్కటి ఫలితాలను అందిస్తున్నాయన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాలు అత్యున్నతమైన విద్యనందిస్తూ విద్యార్థులు బంగారు భవిష్యత్తులకు బాటలు వేస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో అధిక డబ్బులు వెచ్చించి నష్టపోకుండా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో గ్రామానికి చెందిన ఉదయశ్రీ జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించి జిల్లాకే గర్వకారణంగా నిలవడం అభినందనీయమన్నారు. ఇలాంటి విద్యా రత్నాలు ప్రభుత్వ పాఠశాలలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలు జిల్లాకు చక్కటిసీజన్లకు అనుగుణంగా, కాలానికి అనుగుణంగా పంటలను మార్పు చేసుకోవాలన్నారు. చెరువులు గ్రామాల సహజ సంపద అని. చెరువులలో నీరు గ్రామంలో ప్రతి ఒక్కరి స్థిరఆస్తి అన్నారు. ప్రతి గ్రామంలోను రైతులు, వారి జలఆధారం, వారి పంటల సాగు, నీటి వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మైదుకూరు నియోజకవర్గంలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గారి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. జిల్లాలో వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం ఆయన ప్రత్యేకత అన్నారు. జిల్లాలో చేయపట్టిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు రాష్ట్రములోని కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. మన ప్రాంతంలో చెరువులు, సాగునీటి కాలువలు, తదితర అన్ని రకాల ఇరిగేషన్ పనుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూముందుందన్నారు. కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించిన శెట్టి వారి పల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. అంతకుముందు ముదైరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన రామలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ముదైరెడ్డిపల్లె చెరువును పరిశీలించి చెరువులో అభివృద్ధికి సంబంధించి పనుల ప్రణాళికల గురించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల సభ్యులు, ఇరిగేషన్ అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో అగ్రస్థానంలో నిజామాబాద్ జిల్లా
## రికార్డు స్థాయిలో 5.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**61,442 మంది రైతులకు**
**రూ. 1162.18 కోట్ల బిల్లుల**
**చెల్లింపులు కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**



నిజామాబాద్, మే 15 :(విజన్ ఆంధ్ర) యాసంగి-2026 సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 5.68 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు వరి ధాన్యం సేకరణ పూర్తి చేశామని వివరించారు. కేవలం ఐదు శాతం మేరకు మిగిలి ఉన్న మరో 32,797 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం వేగవంతంగా వారం రోజుల్లోపు కొనుగోళుపూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని తెలిపారు. ఈ సీజన్ లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా, 95 శాతం ధాన్యం సేకరణ పూర్తి చేశామని తెలిపారు. సేకరించిన ధాన్యం విలువ రూ. 1358.20 కోట్లు కాగా, అందులో 61,442 మంది రైతులకు వారి ఖాతాలలో రూ. 1162.18 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని కలెక్టర్ వివరించారు. ట్యాబ్ ఎంట్రీలలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో ఉందని, కేవలం మరో 9శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తికావాల్సి ఉందన్నారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా రైస్ మిల్లులకు చేరవేసే విషయంలోనూ నిజామాబాద్ జిల్లా అగ్రభాగాన ఉందని, మిల్లర్ల నుండి 96శాతం మేర ఎక్ నాలెడ్జ్ మెంట్ పూర్తయ్యిందని వివరించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ కోసం సరిపడా హమాలీలు, వెంటదివెంట ధాన్యం రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలను సమకూర్చడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

## బక్రీద్ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా

**-అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత**
**నిందితులపై కేసు నమోదు,**
**-చట్టవిరుద్ధ కార్యకలాపాలపై 100 కు**
**సమాచారం ఇవ్వండి ఎస్పీ**




జడ్చర్ల / నవాబ్ పేట /మే 15,(విజన్ ఆంధ్ర):బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో పశువుల అక్రమ రవాణా, పై మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం నమ్మదగిన సమాచారం మేరకు నవాబుపేట్ మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతుల వద్ద నుంచి పశువులను కొనుగోలు చేసి వధించేందుకు, ఇతరులకు విక్రయించేందుకు తరలించడానికి సిద్ధంగా ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన నవాబుపేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో చట్టవిరుద్ధంగా పశువులను తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదేవిధంగా పశువులను స్వాధీనం చేసుకొని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణా, జంతు హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే 100 కు సమాచారం అందించాలని కోరారు

## ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల మే 15(విజన్ ఆంధ్ర)గద్వాల పట్టణ కేంద్రంలోని గంజిపేటలో ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరైనారు. గద్వాల టౌన్ గంజి పేట చెందిన మార్తమ్మ భర్త సుందర్ రాజు కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు. ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూనూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ శంకర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు సురేందర్ రెడ్డి , తిమ్మన్న, లక్ష్మణ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ కు ఘన స్వాగతం



నిజామాబాద్, మే 15 :( విజన్ ఆంధ్ర ) సమాచార హక్కు చట్టం - 2005 పై పీఐఓలకు, ఏపీఐఓలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డికి, కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వీ.శ్రీనివాస్ రావులకు జిల్లా అధికారులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి నేతృత్వంలో ఆ సంఘం నాయకులైన కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, సతీష్, ప్రభు తదితరులు పూల మొక్కలు అందించారు

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నీ సన్మానించిన

### వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప



గద్వాల మే 15 (విజన్ ఆంధ్ర) గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గా గట్టు తిమ్మప్ప బాధ్యతలు స్వీకరించి సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మర్యాదగాపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి**



గద్వాల మే 15( విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లాలోని పలు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రవేశం పొందాలనుకునే అర్హులైన ఎస్సీ (ఎస్ సి) విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో డే స్కాలర్‌గా చేరాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా 01-06-2019 నుండి 31-05-2020 మధ్య జన్మించి ఉండాలని, దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు నకళ్లను జతచేయాలని, సమర్పించే పత్రాలన్నింటినీ గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టెడ్ చేయించి సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం లేదా ఏవైనా సందేహాలు ఉంటే 9491767689 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అనాధ కుటుంబానికి అండగా ఉంటా



కొల్లాపూర్ మే 15 : (విజన్ ఆంధ్ర)కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో తల్లారి ఈశ్వరమ్మ (45) మృతి చెందారు.... గత నాలుగు సంవత్సరాలు క్రితం ఇంటి పెద్ద దిక్కు అయినా తండ్రి తలారి భగవంతు మృతి చెందాడు , వీరికి ముగ్గురు ఆడ కూతుర్లు ఓ బాబు ఉన్నారు. అన్ని తానే అలనా పాలన చూస్తున్న కన్నతల్లి తలారి ఈశ్వరమ్మ కూడా మృతి చెందడంతో ఆ కుటుంబం అనాధగా మిగిలిపోయింది. శుక్రవారం గ్రామ సర్పంచ్ శశికళ అమరేశ్వర్ ద్వారా విషయం తెలుసుకున్న కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుర గౌని నిర్మల నిరంజన్ గౌడ్ ఆ కుటుంబాన్ని ఫోన్ ద్వారా పమర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా దశదిన ఖర్చుల నిమిత్తం రూ 5000 నగదు,50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లూరు గ్రామ సర్పంచ్ శశికళ అమరేశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ నక్క నిరంజన్ యాదవ్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, బాలవర్ధన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నరేష్, నిరంజన్ నాయుడు, మూర్తి , మరికంటి శేఖర్, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ముందస్తు అప్రమత్తతతో విపత్కర సమయాల్లో నష్ట నివారణ -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,మే 15,(విజన్ ఆంధ్ర);ముందస్తు అప్రమత్తత ద్వారానే విపత్కర సమయాల్లో నష్టపోకుండా ఉండగలుగుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. భవిష్యత్తులో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధతపై నిర్వహించనున్న మార్క్ ఎక్సర్సైజ్ వివరాలను హైదరాబాద్ నుండి కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ నుండి మేజర్ జనరల్ సుధీర్ బేహాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ హరిచందన దాసరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీన, వై ఎస్ ఆర్ కాలనీలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అంతా భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఇటువంటి ముందస్తు సన్నద్ధత ద్వారా ప్రజల్లో విపత్కర పరిస్థితుల సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, సిపిఓ జీవరత్నం, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్

కొల్లాపూర్ మే 15 :(విజన్ ఆంధ్ర) నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను మంచినీటి వాటర్ బాటిల్ లను పని ప్రదేశంలో నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు మంచినీటి కొరత ఉందని గ్రహించి, మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కూలీలకు వాటర్ బాటిల్స్ ఓ ఆర్ ఎస్ పాకెట్లను అందజేశామని వాళ్ళు తెలిపారు. అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పని చేయాలని, తరచూ నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కూలీలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోగ్రామ



తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రంధాయలంలో పుస్తకాలు ప్రదర్శన



పెబ్బేరు, మే 15 (విజన్ ఆంధ్ర)రాష్టం ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపడుతున్న ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెబ్బేరు శాఖ గ్రంధాలయం యందు శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కీ శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పుస్తకాల వల్ల ఎంతో మేధాశక్తి పెంపొందించుకోవచ్చని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను ప్రజల సద్వినియోగం చేసుకొని , విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఆయన వివరించారు. గ్రంథాలాయలు గ్రామీణ ప్రాంతాలకు దిక్సూచి లాంటివి అని, చదువుకోడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, ఈ గ్రంథాలయాలు ఎంతో తోడ్పాటు నీ స్త యని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైబ్రరీయన్ శ్రీమతి జ్యోతి, సిబ్బంది జి. గాంధీ పాఠకులు చంద్రశేఖర్ రెడ్డి ఎల్ల స్వామి,, లోకేష్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

# యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' గొడపత్రిక విడుదల




నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) మే 15 శుక్రవారం తెలంగాణ ప్రభుత్వంజిల్లా యువజన మరియు క్రీడల శాఖ,రూమ్ నెం. +1, ఐ.డి.ఓ.సి బిల్డింగ్, కలెక్టరేట్ బిల్డింగ్, నాగర్ కర్నూల్ జిల్లా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' గొడపత్రిక విడుదల చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత కేశవ్ పాటీల్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో క్రీడలపై ఆసక్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహింబడుతుంది. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆరు రోజుల ప్రణాళికలో యువత, ఎన్.జి.ఓ., యూత్ కబ్ల్, యవజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు, క్రీడాకారలు అత్యధికంగా ఈ కార్యక్రమములో పాల్గోనవలసిందిగా జిల్లా కలెక్టర్ తెలియజేయడమైనద్ధి. మొదటి రోజు (18న) జిల్లా స్థాయి మరియు మండల స్థాయిల్లో "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" పేరుతో మార దాన్ 2కే మరియు 5కే రన్ చేపట్టనున్నారు.ధ రెండో రోజు (19న) జిల్లా స్థాయిల్లో కెరీర్, నైపుణ్యాభివృద్ధిపై కార్యక్రమాలు ఉంటాయి.ధ మూడో రోజు (20న) జిల్లాస్థాయిలో యువతకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తారు. ధ నాలుగో రోజు (21న) జిల్లా స్థాయిలో 'స్పోర్ట్స్ డే' ఉంటుంది.ధ ఐదో రోజు (22న) మండల, మరియు జిల్లా స్థాయిల్లో స్వచ్ఛ తెలంగాణ కోసం యువతను సంసిద్ధం చేస్తారు. శ్రమదానం ద్వారా స్వచ్ఛ కార్య క్రమాలను నిర్వహిస్తార్ధు. ఆరో రోజు (23న) జిల్లాస్థాయిలో ఉద్యోగ సాధన కార్యక్రమాలు చేపడతారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబందించిన గొడ పత్రికను విడుదల కార్యక్రమమలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్, రెవెన్యూ డివిజినల్ అధికారి సురేశ్ బాబు, జిల్లా పరిశ్రముల శాఖ జి.యం. బి. సచిన్, జిల్లా ఎంప్లాయిమేంట్ అధికారి రాఘవేంద్ర సింగ్ మరియు జిల్లా యువజన క్రీడల అధికారి వి. సీతారాం మొదలగు అధికారులు పాల్గోన్నారు.

# నన్ను సస్పెండ్ చేసే అధికారం మండల పార్టీకి లేదు..

- సతీష్ రెడ్డి నువ్వు చేస్తే సంసారం నేను చేస్తే వ్యభిచారమా..?
- నీ కారుపై జగన్మోహన్ రెడ్డి ఫోటో ఎందుకు..? పార్టీ ఆఫీస్ లో బర్త్డే లు చేసిన చరిత్ర నీది..?
- మండల పార్టీ నిర్ణయాన్ని ఖండించిన కోలేటి..

పినపాక, మే 15(విజన్ ఆంధ్ర): గురువారం రోజున నన్ను బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లుగా మండల కమిటీ అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి ప్రకటించిన అంశాన్ని గూర్చి తెలుపుతూ. ఈ రోజున 15. 5 .2026 ప్రెస్ నోట్ ద్వారా తెలియజేస్తున్నాను బిఆర్ఎస్ పార్టీలో రాష్ట్రస్థాయి కమిటీ నియోజకవర్గ ఇన్చార్జిలు మాత్రమే ఉన్నారు. మిగతా మండల, జిల్లా స్థాయి కమిటీలు మరియు అనుబంధ సంఘాల కమిటీలు రద్దు అయినట్లుగా పార్టీ అధిష్టానం ప్రకటించారు. పినపాక మండల అడహక్ కమిటీ అని ప్రస్తావిస్తూ నిన్న ప్రెస్ నోట్ జారీ చేసి నన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అడహక్ కమిటీ ఎప్పుడు వేసినారు ఒకవేళ కమిటీ వేస్తే అది అధిష్టానముద్ర ఆమోదం లోకి వచ్చిన తర్వాతే అమల్లోకి వస్తుంది అని తెలుపుతున్నాను. తుమ్మల నాగేశ్వరరావుకి బిఆర్ఎస్ పార్టీ తరఫున పాలాభిషేకం చేయలేదు. వ్యక్తిగతంగా అన్ని పార్టీలలో ఉన్న తుమ్మల అభిమాన సంఘం నుండి కలసి ఆ వేడుకలలో పాల్గొనడం జరిగింది. ఒకవేళ అది తప్పు అయితే శ్రీ పగడాల సతీష్ రెడ్డి కారుపై వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి బొమ్మ పెట్టుకొని ఎందుకు తిరుగుతున్నారు. ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజున వేడుకలు ఎందుకు నిర్వహిస్తున్నారు మీరు చేసే తప్పు కాదా..? రేగ గుర్తించాలి ఆయన చేస్తే సంసారం నేను చేస్తే వ్యభిచారమా తుమ్మల కాంగ్రెస్ పార్టీలోకి పోయినప్పుడు నేను బిఆర్ఎస్ పార్టీలోనే రేగా వెన్నంటి పనిచేసిన నాయకుడిని నన్ను పార్టీలో కొనసాగించడం లేదా తొలగించడం తుది నిర్ణయం రేగాదే... నన్ను సస్పెండ్ చేసే అధికారం మండల పార్టీకి లేదని మరోసారి చెబుతున్నాను 14.5.2026న బూర్గంపాడు మండలానికి చెందిన కొంతమంది టిఆర్ఎస్ నాయకులు మరియు వనమా వెంకటేశ్వరరావు కూడా తుమ్మల కి సన్మానం చేశారు. వీరందరినీ కూడా పార్టీ నుండి సస్పెండ్ చేస్తారా..?పార్టీ వేరు వ్యక్తిగత అభిమానం వేరు ఒకసారి సతీష్ రెడ్డి ఆత్మ విమర్శ చేసుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. నా నుండి స్వార్థ రాజకీయాలకు తావులేదు అని నేను కాంగ్రెస్ పార్టీకి పోయే సమస్య లేదని భవిష్యత్తులో కూడా అలాంటి ఆలోచన రాదని స్పష్టం చేశారు రేగా కాంతారావు నుండి స్పందన కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు.

# ఉపాధి పనులను వేగవంతం చేయాలి

-కార్మికుల మొబిలైజేషన్పై ప్రత్యేక దృష్టి సారించాలి
-అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ ఆదేశం



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 15 (విజన్ ఆంధ్ర) ఉపాధి హామీ పథకంలో కార్మికుల మొబిలైజేషన్పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ స్థాయిలో పనులను వేగవంతంగా చేపట్టి అర్హులైన కార్మికులకు ఉపాధి కల్పించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనుల అమలును అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో కార్మికుల మొబిలైజేషన్పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామ స్థాయిలో పనులను వేగవంతంగా చేపట్టి అర్హులైన కార్మికులకు ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పనుల నాణ్యతను కాపాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అవెన్యూ ప్లాంటేషన్లో మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. డి ఆర్ డి ఓ ఉమాదేవి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# వడ్లను తూకం వేయకుండా ఇబ్బంది పెడుతున్నారు

-బీజేపీ నేతలు విమర్శ



పెబ్బేరు, మే 15 (విజన్ ఆంధ్ర) భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్య సేకరణ కేంద్రంలో శుక్రవారం రైతుల దగ్గరికి వెళ్లి వారి సమస్యల ను తెలుసుకోవడం జరిగింది. ఒక నెల రోజుల నుండి రైతులు వరి ధాన్యాన్ని తెచ్చి పగలంతా కష్టపడి ఆరబెట్టిన చెమటోడ్చినా వడ్లను కాంట చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని . అదేవిధంగా అనేక రకాల సమస్యలతో రైతుల దగ్గర నుండి తరుగు పేరుతో క్వింటాలుకు 6 కిలోల ఓడ్ల ను తీసుకోవడం మరియు ట్రాన్స్పోర్ట్ విషయంలో కూడా చాలా ఇబ్బందులు పెడుతున్నారని బీజేపీ నేతలు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగానే పంట సేకరణ మీద ప్లానింగ్ లేకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని కాబట్టి రైతులు పండించిన పంటను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందని . ధాన్య సేకరణ విషయంలో అలసత్వం వహించి రైతులను ఇంకా ఇబ్బంది పెడితే భారతీయ జనతా పార్టీ రైతులతో రాస్తారోకోలు ధర్నాలు చేపట్టి వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు కావలి క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి రాఘవేంద్ర గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కంచె ఆంజనేయులు, జిల్లా కౌన్సిల్ మెంబెర్ సూరగౌని రంగస్వామి గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చింతల రామకృష్ణ, జిల్లా విద్యాసెల్ కన్వీనర్ నరసింహ నాయుడు, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు చింతకాయల శివ, మరియుపట్టణ ప్రధాన కార్యదర్శులు అల్వాల సర్వేశ్వర్ గౌడ్,మోతె రాఘవేంద్ర , దిలీప్ రెడ్డి, పట్టణ సోషల్ మీడియా ఇన్చార్జ్ జగత్కారి నర్సొజీ, కార్తీక్ పాల్గొన్నారు.

# చెంచుల జీవనోపాధి అభివృద్ధికి టీజీఐఎల్పీ కీలకం

-నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- మల్లాపూర్ పెంట చెంచులతో సమావేశమైన కలెక్టర్





అచ్చంపేట మే 15 (విజన్ ఆంధ్ర)నాగర్కర్నూల్ జిల్లాలోని ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ)ను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా కలెక్టర్ తెలుసుకున్నారు. కుటుంబాల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య పరిస్థితులు, పిల్లల విద్య, తాగునీటి సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., చెంచు గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న చెంచు కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీజీఐఎల్పీ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించి, వారిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చాలని అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునే కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి వారి సామర్థ్యాలు, ఆసక్తులను ఆధారంగా చేసుకుని ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పశుపోషణ, కోళ్ల పెంపకం, చిన్నచిన్న వ్యాపారాలు, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులకు ఆదేశించారు.చెంచు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మళ్లీ 20వ తేదీన సందర్శిస్తానని అప్పటివరకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించాలని కోరారు మహిళా సంఘాల ద్వారా పొదుపు అలవాట్లు పెంపొందించి, బ్యాంకు లింకేజీలు కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మల్లాపూర్ పెంటలో మౌలిక వసతుల కొరతపై గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తాగునీరు, విద్యుత్, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన చెంచు కుటుంబాలకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత పథకాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి ప్రయోజనాలు అందకుండా ఎవరూ మిగలకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.చెంచు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం సాయం అందించడం మాత్రమే కాకుండా, ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపగలిగే స్థాయికి తీసుకెళ్లడమేనని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపునకు మరిన్ని వాహనాలు వాడండి

- కాంట్రాక్టు లారీలే కాకుండా ఇతర వాహనాలూ సిద్ధం చేయాలి
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశం




వనపర్తి జిల్లా ప్రతినిధి మే 15 (విజన్ ఆంధ్ర): జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి అత్యధిక సంఖ్యలో లారీల అవసరం ఉన్న నేపథ్యంలో కాంట్రాక్టు లారీలే కాకుండా ఇతర వాహనాలను కూడా వినియోగించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాదు నుండి పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో పాటు, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా రవాణా శాఖ అధికారిని మానస, పౌర సరఫరాల బియ్యం ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలించేందుకు అత్యధికంగా వాహనాల అవసరం ఉందని తెలిపారు. కాంట్రాక్టర్ల లారీలే కాకుండా, ప్రైవేటు లారీలు డీసీఎంలను కూడా ధాన్యం తరలింపునకు వినియోగించుకోవాలని ఆదేశించారు. వారికి ట్రాన్స్పోర్ట్ కు గాను పేమెంట్ చేయడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి ట్రాన్స్పోర్ట్ విషయంలో ఇబ్బంది రాకుండా వాహనాలను సిద్ధం చేసుకోవాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. విసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి అత్యధిక సంఖ్యలో లారీల అవసరం ఉన్న నేపథ్యంలో కాంట్రాక్టు లారీలే కాకుండా ఇతర వాహనాలను కూడా వినియోగించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా డీసీఎంలు, లారీలు ఏవైనా ఉంటే సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో ధాన్యాన్ని తరలించేందుకు కాంట్రాక్టు లారీలు కాకుండా అదనంగా రవాణా శాఖ చొరవతో 10 డీసీఎంలు, 20 ట్రాక్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్






వనపర్తి జిల్లా ప్రతినిధి మే 15 (విజన్ ఆంధ్ర భవిష్యత్తులో వచ్చే ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోడానికి జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసుకున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో వచ్చే పర్యావరణ విపత్తులను ఏవిధంగా ఎదుర్కోవాలి ఎలా సన్నద్ధం కావాలి అనే అంశాల పై కేంద్ర, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ద్వారా టేబుల్ ప్రాక్టీస్ కు ఆదేశించగా శుక్రవారం కలెక్టర్ ఎన్.ఐ.సి. హాల్లో ఆయా శాఖల అధికారులు టేబుల్ టాప్ శిక్షణ పొందారు. హైదరాబాద్ నుండి కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ నుండి మేజర్ జనరల్ సుధీర్ బేహాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ హరిచందన దాసరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో సాధారణంగా కృష్ణా నదిలో ప్రవాహం పెరిగి వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ప్రమాదాలు సంభవిస్తే, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ఆయా ప్రభుత్వ శాఖలు ఏ విధంగా స్పందించాలి, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు ఏమిటి అన్నదానిపై కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు.ఇప్పటికే సిద్ధం చేసుకున్న కార్యాచరణ ప్రణాళికతో మే , 18వ తేదీన ఉదయం 9 గంటల నుండి జిల్లాలోని ఎంపిక చేసిన 7 ప్రాంతాల్లో మాక్ డ్రిల్ చేయనున్నట్లు తెలిపారు. మాక్ డ్రిల్ చేసేందుకు 1. గడ్డ బస్వాపూర్ గ్రామం, చిన్నంబావి మండలం, 2.జూరాల ప్రాజెక్ట్ ఎడమ కాలువ, అమర్చింత మండలం, 3.శంకరంపేట వాగు, మదనపూర్ మండలం, 4.భగీరథ కాలనీ, వనపర్తి 5. నల్లచెరువు, 6. మర్రికుంట 7.ప్రభుత్వ ఆసుపత్రి, వనపర్తి ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గుర్తించిన అన్ని 7 ప్రాంతాలకు ఇంచార్జి అధికారులను నియమించినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ రాజేష్ మీనా, అందరూ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే విజ్ఞాన శిఖరాలకు చేరవచ్చు

-మొబైల్ వినియోగం తగ్గించి గ్రంథాలయాలకు రావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 15, (విజన్ ఆంధ్ర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 'లైబ్రరీ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, గ్రంథాలయాలను ఎక్కువగా సందర్శించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.గ్రంథాలయాలు జ్ఞానానికి హృదయ స్పందన వంటివని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇవి బలమైన పునాది వేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు."విద్య పేదవారి తలరాతను, రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుందనే నినాదాన్ని గుర్తు చేస్తూ, ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని నిత్య అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న అపారమైన జ్ఞాన సంపదను వినియోగించుకుని సమాజంలో గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు, బుక్ టాక్స్ పఠన కార్యక్రమాలు విద్యార్థులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.గ్రంథాలయాన్ని చురుగ్గా వినియోగిస్తూ నిరంతరం పఠనంలో పాల్గొంటున్న ఉత్తమ పాఠకులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, వారికి పుస్తకాలను బహుకరించారు.జిల్లాలో పఠన సంస్కృతిని మరింత బలోపేతం చేయడానికి కమ్యూనిటీ రీడింగ్ డ్రైవ్, పుస్తక విరాళాల సేకరణ వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారుచివరగా, నేడు చదవండి భావి తరాలకు నాయకులుగా ఎదగండి అనే స్ఫూర్తిదాయక సందేశంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియకు ప్రజలు సహకరించాలి

## – అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 15 (విజన్ ఆంధ్ర) జిల్లాలో 2027 జనగణనలో భాగంగా మే 11 నుండి ఇంటింటి గణన కార్యక్రమం ప్రారంభమైందని, ఇందుకోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి, ఖచ్చితమైన సమాచారాన్ని తెలియజేయాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖిమ్యా నాయక్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ గణనలో భాగంగా ప్రతి ఇంటి పరిస్థితి, ఇంటి నిర్మాణ స్వభావం, గదుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, వంట ఇంధనం (గ్యాస్+, కట్టెలు, విద్యుత్), వాహనాలు, ఇంటర్నెట్ సదుపాయం వంటి వివరాలను సేకరిస్తారని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యుల వివరాలు, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ తదితర గృహోపకరణాల వివరాలను కూడా నమోదు చేయనున్నట్లు చెప్పారు. మొత్తం 33 ప్రశ్నల ద్వారా ఇంటి వివరాలను సేకరించే ఈ ప్రక్రియలో అధికారులు అడిగే ప్రశ్నలకు ప్రజలు సరైన సమాచారం అందించాలని సూచించారు. జనగణనలో భాగంగా ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రభుత్వ అధికారిక గుర్తింపు కార్డు ఉంటుందని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చి, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ సహకరించి గణన ప్రక్రియను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామ గ్రామాన పార్టీ సభ్యత్వ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగించాలి

## – పర్వతగిరి బీ.ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు

వరంగల్ జిల్లా ప్రతినిధి మే15(విజన్ ఆంధ్ర):వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రంలోని బి. ఆర్. ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి విస్తృతంగా చేపట్టి ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను చేరవేయాలని పిలుపునిచ్చారు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన సేవలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బీ. ఆర్. ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో తెలంగాణ సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బి ఆర్ ఎస్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, మండలాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో సభ్యత్వం పొందుతున్నారని, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు పార్టీపై విశ్వాసం



ఉంచి ముందుకు వస్తుండటంఆనందదాయకమని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారంలో బి ఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, గ్రామీణాభివృద్ధి, సాగునీరు, రైతు సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతి కోసం పార్టీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత బలమైన సంస్థాగత నిర్మాణంతో ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం గత బీ. ఆర్. ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత అలుపెరుగని ప్రజా సేవకుడు ఇంచుమించు లక్ష మెజారిటీతో రెండు సార్లు చేరుకునే దిశగా రెండవసారి ప్రజలచే ఎన్నుకోబడిన వ్యక్తి మాజీ శాసనసభ్యులు లిఅరూరి రమేష్లి గారు అలాంటి నాయకుడు పై కొంతమంది మండల కాంగ్రెస్ నాయకులు ఇష్టరీతిలో విమర్శలకు పాల్పడుతున్నారు. మీ స్థాయి ఏంటో తెలుసుకొని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాల్సిందిగా హెచ్చరిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయంసీ మాజీ డైరెక్టర్లు బోయినపల్లి యుగంధర్ రావు, పట్టాపురం ఏకాంతం గౌడ్,మండల పార్టీ మాజీ అధ్యక్షులు రంగు కుమార్, మండల రైతు బంధు మాజీ మాజీ అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్,మొత్య తండా సర్పంచ్ నరేష్ సొసైటీ డైరెక్టర్ దొమ్మటి లక్ష్మీనారాయణ రావు, మండల సీనియర్ నాయకులు బొట్ల మధు,చిన్నపాక శ్రీకాంత్, పసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులతో గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపు

ములుగు మే 14;విజన్ ఆంధ్ర ప్రతినిధిములుగు జిల్లాలో ఉపాధి, ఇండ్లు, మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం గా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణాభివృద్ధికి బలమైన ఆధారంగా మారుతోంది. గ్రామాల్లో ఉపాధి కల్పనతో పాటు పేద కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతూ, పల్లెల్లో మౌలిక వసతులు అభివృద్ధి చెందుతున్నాయి. జిల్లాలోని 10 మండలాల పరిధిలో ఉన్న 171 గ్రామపంచాయతీలలో ఇప్పటివరకు 81,483 కుటుంబాలకు జాబ్ కార్డులు జారీ చేయగా, 1,66,936 మంది కూలీలు నమోదయ్యారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 13,370 కుటుంబాలకు చెందిన 19,553 మంది కూలీలకు ఉపాధి కల్పించడం జరిగింది. దీంతో గ్రామీణ కుటుంబాలకు ఆదాయం లభిస్తూ వలసలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 4.71 లక్షల పని దినాలు మంజూరుకాగా, ఇప్పటికే 2.10 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. కూలీలకు రూ. 6.40 కోట్ల వేతనాలు చెల్లించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నగదు ప్రవాహం పెరిగింది. రోజుకు సగటున రూ. 286.30 కనీస వేతనం అందుతుండటం కూలీల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోంది. అలాగే జిల్లాలో 118 కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసి ఉపాధి హామీ పథక ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల




నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో 639 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకాగా, అందులో 424 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ పనుల ద్వారా గ్రామీణ కూలీలకు రూ. 68.28 లక్షల వేతనాలు చెల్లించారు. దీని వల్ల ఒకవైపు పేదలకు శాశ్వత నివాసాలు కల్పించబడుతుండగా, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. వ్యక్తిగత ఆస్తుల సృష్టికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, కోళ్ల షెడ్లు, చెక్ డ్యాంలు, ఇంకుడు గుంతలు వంటి పనులు గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేస్తుండడం గమనార్హం.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు లక్కీ డ్రా

## అదనపు కలెక్టర్ నర్సింగరావు (స్థానిక సంస్థలు)



గద్వాల మే 15 (విజన్ ఆంధ్ర)బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ రావు తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదనపు కలెక్టర్ మాట్లాడుతూ,గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేపట్టామని తెలిపారు. మూడవ తరగతిలో 3 సీట్లు,ఐదవ తరగతిలో 2 సీట్లు,ఎనిమిదో తరగతిలో 1 సీటు కలిపి మొత్తం 6 సీట్ల భర్తీకి లక్కీ డ్రా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇందుకు మొత్తం 12 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పూర్తి పారదర్శకతతో డ్రా నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, హెచ్‌డబ్ల్యూఓ పవన్ కుమార్,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండుటెండలో మారుమూల ప్రాంతం ఆత్నాం గూడలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

## సంబురపడ్డ ఆదివాసులు బ్యాండు మేళంతో ఘన స్వాగతం



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 15, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని మారుమూల ప్రాంతమైన ఆత్నాం గూడ గ్రామంలో శుక్రవారం మిట్ట మధ్యాహ్నం మండుటెండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. తమ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కి ఆత్నాం గూడ ఆదివాసులు బ్యాండు మేళలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. నా ప్రజల పిలుపే నాకు ముఖ్యం వారి కొరకు ప్రకృతిని లెక్కచేయనని అన్నారు. మారుమూల గ్రామమైన ఆత్నాం గూడ గ్రామ ప్రతీ సమస్యను విన్నాను కచ్చితంగా మళ్ళీ వస్తానని అన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో రూ. 10 లక్షలతో షెడ్డు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఆట్నం గూడ గ్రామస్తులు గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. వారికి ఆనాడు హామీ ఇచ్చాను, గ్రామ పంచాయతీగా చేసి హామీ నెరవేర్చుకున్నాను. తప్పకుండా గ్రామస్తులు తెలిపిన కోరికలను దశల వారిగా నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# భూ కబ్జాలు, నకిలీ పత్రాలు సృష్టించే ముఠాపై మావల పోలీసులు ఉక్కుపాదం

## మరొక నిందితురాలు అరెస్ట్నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం నిందితురాలు మాజీ కౌన్సిలర్ భార్య.

## – మావల సీఐ కర్ర స్వామి

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 15, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీ ప్రాంతంలో ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకొని భూ కబ్జాలు, నకిలీ పత్రాల సృష్టి, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ముఠాపై మావల పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో భాగంగా షబానున్నీసా (36) అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ జిల్లా మావల సీఐ కర్ర స్వామి తెలిపారు. జిల్లా లోని తల మడుగు మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన దొనకొండ బేబీతాయ్ ఫిర్యాదు మేరకు, ఆమెకు చెందిన ప్లాట్ నెం. 49, 50లను నకిలీ మున్సిపల్ రికార్డులు, కట్టుకథల లింక్ డాక్యుమెంట్లతో అక్రమంగా ఆక్రమించి, అసలు యజమానులను బెదిరించినట్లు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో మాజీ కౌన్సిలర్ పైక్ రావు ఆనంద్, సద్దాం హుస్సేన్, లంఠిలే సంతోష్, బోదకుంట రాజు, షేక్ షాదుల్లా తదితరులు ఖాళీ స్థలాలను గుర్తించి, నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. మావల ఇన్‌స్పెక్టర్ కె. స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో, శ్రీ నిలయం



అపార్ట్‌మెంట్ వద్ద షబానున్నీసాను అదుపులోకి తీసుకుని విచారించగా, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాల తయారీలో తన పాత్రను అంగీకరించింది. ఆమె వద్ద నుంచి డాక్యుమెంట్ నెం. 5685/2023కు సంబంధించిన నకిలీ సేల్ డీడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించి మరికొందరు నిందితులు ఇదివరకే అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్నారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల ధృవీకరించిన రికార్డుల ఆధారంగా బాధితుల అసలు యాజమాన్యాన్ని పోలీసులు నిర్ధారించారు. ప్రజలకు విజ్ఞప్తి: మావల, కేఆర్కే కాలనీ పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు తమ ఆస్తులను తరచుగా పరిశీలించుకోవాలని, ఈసీ మరియు మున్సిపల్ రికార్డులను తనిఖీ చేసుకోవాలని సూచించారు. భూ కబ్జాలు, నకిలీ పత్రాలు, బెదిరింపులకు గురైన వారు భయపడకుండా మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు బోరు వేయించిన సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్



చారకొండ, మే 15 (విజన్ ఆంధ్ర)చారకొండ గ్రామపంచాయతీ పరిధిలో ఐదవ వార్డ్ లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన చారకొండ గ్రామ సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ కీసర్ మల్లేష్ అధ్యక్షతన నీటి కొరత అధిక సంఖ్యలో ఉందని గమనించి ప్రత్యేకంగా బోరు మోటర్ ను పిలిపించి ఐదో వార్డు కాలనీ లో బోరు వేయించారు. సర్పంచ్ గుండె విజేందర్ తీసుకున్న చర్య పట్ల వార్డు ప్రజలు సర్పంచ్ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు చండీశ్వర్,పల్చ వెంకటయ్య, సత్తూరి జంగయ్య, ఆరెళ్ళ సత్యం,చారకొండ లక్ష్మయ్య, మట్ట అనిల్,ఎలే పెద్దయ్య, చింతపల్లి నారాయ్య తదితరులు ఉన్నారు.

# ఒప్పందం ప్రకారం సకాలంలో పనులు పూర్తి చేయాలి

## ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల మే 15 (విజన్ ఆంధ్ర)అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ , విద్యా, వైద్య, తదితర ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో చేపట్టిన ఆయా నిర్మాణాల పురోగతిపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ నిధులతో చేపట్టిన ఆయా పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రూసా, నాబార్డ్, నేషనల్ హెల్త్ మిషన్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, తదితర నిధులతో చేపట్టాల్సిన పనులు పెండింగ్ లో ఉండకూడదని, టెండర్స్ పూర్తి చేసి కాంట్రాక్టర్లతో ఒప్పందం ప్రకారం పనులు చేయించాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల భవనం, ఇతర నిర్మాణాల పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్, ఎంబీలు, తదితర రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయా చేసిన పనులకు సంబంధించిన ఫోటోలు సకాలంలో పంపించాలని ఆదేశించారు. కేజీబీవీ లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు చేసి పంపాలన్నారు. పీఎం శ్రీ నిధులతో ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి భవనాలు, ఇతర ఆన్ గోయింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాల్సిందిగా సంబంధించిన శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆయా శాఖల ఈఈలు ప్రభాకర్, ప్రగతి, రామచందర్, డీఈలు, ఏఈఈ లు, తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీల సంక్షేమం, హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నాం

## దళితవాడల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

## అట్రాసిటీ కేసుల్లో జాప్యం లేకుండా పరిహారం అందించాలి

## – జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 15, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సంక్షేమానికి, వారి చట్టపరమైన హక్కుల రక్షణకు యంత్రాంగం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ,




ఎస్సీ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలోని అర్హులైన నిరుపేదలకు నేరుగా చేరాలని ఆకాంక్షించారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంక్షేమ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, బాధితులకు సకాలంలో న్యాయంతో పాటు పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎస్సీల రక్షణకు సంబంధించిన చట్టాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ కమిటీ తరచుగా సమావేశమై కేసుల పురోగతిని సమీక్షించాలని, ఎస్సీలపై ఎలాంటి వేధింపులు జరగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాలను పకడ్బందీగా నిర్వహించి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. అర్హులైన ఎస్సీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా పూర్తి స్థాయిలో చేయూతనిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ ఋత్విక్ సాయి కొట్టే, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు


## రైతులతో మాట్లాడి సమస్యలు, మార్కెట్ సదుపాయాలపై ఆరా తీసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 15, (విజన్ ఆంధ్ర) రైతులు పండించిన జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, మార్కెట్‌లో కల్పిస్తున్న సదుపాయాలపై రైతులను అడిగి వివరాలు సేకరించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. జొన్నల కొనుగోలు ప్రక్రియలో గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం టెంట్లు, చల్లటి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచుతున్నామని, అందులో భాగంగానే శుక్రవారం కజ్జర్ల, జరి, భీంపూర్ గ్రామాల్లో కొత్త కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రైతులు మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకువచ్చి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు,సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

## – కంది శ్రీనివాస రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,మే 15, (విజన్ ఆంధ్ర) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ కు రానున్నారని భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన క్యాంపు ఆఫీసు లో తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ఇక్కడ నుండే మొదలు పెడతారని అన్నారు. ఆయనతో పాటు గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇతర మంత్రులు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు ఈ బహిరంగ జభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వార్తా కథనాలతో రైతుల్లో ఆందోళన సృష్టించవద్దు

**- ప్రభుత్వం పూర్తి స్థాయిలో పంటను కొనుగోలు చేస్తుంది**

**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం జిల్లా బ్యూరో, మే15 (విజన్ ఆంధ్ర): ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. వివిధ దినపత్రికల్లో (విజన్ ఆంధ్ర కాదు) మే 15న శుక్రవారం రోజున మొక్కజొన్న కొనుగోలు, లిఫ్టింగ్‌లో జాప్యం జరుగుతోందంటూ ప్రచురితమైన వార్తలు అసంపూర్ణ సమాచారం ఆధారంగా ప్రచురించబడినవని జిల్లా కలెక్టర్ రిజాయిండర్ జారీ చేశారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం, టీజీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సజావుగా కొనసాగుతోందని తెలిపారు. యాసంగి సీజన్ 2025-26లో భారీ స్థాయిలో దిగుబడులు రావడంతో కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద లోడెడ్ వాహనాల కదలికలో తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు. అధిక స్టాక్ నిల్వలు, పరిమిత అన్‌లోడింగ్ స్థలాల కారణంగా కొంత ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ, సమస్య పరిష్కారానికి యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగలేదని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ గోదాములు, నిల్వ కేంద్రాలు సిద్ధం చేయడం జరుగుతోందన్నారు . కొనుగోలు కేంద్రాల పనితీరును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో మొక్కజొన్న, వరి పంట పండించిన రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1077 ను ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం, మొక్కజొన్న పంటకు ఎవరైనా కోతలు విధించిన లేక ఏ ఇతర సమస్య ఉన్న వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అసత్య, అసంపూర్ణ వార్తలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆ రిజాయిండర్ లో స్పష్టం చేశారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ రూపు దిద్దుకుంటోంది

**- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**- వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి**

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ**




సంగారెడ్డి, మే,15(విజన్ ఆంధ్ర బ్యూరో ) : రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తో కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కే జేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్×× కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటుకానున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 9 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఎదగనున్న నేపథ్యంలో తెలంగాణ కూడా ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. 65 శాతం పైగా యువత నైపుణ్యాలను వినియోగించుకొని తెలంగాణను మరింత శక్తివంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలను గుర్తించి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ దేశంలో అత్యధిక వరి ధాన్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదే తరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న కే జేఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి స్వర్గీయ ఇందిరా గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఏర్పడిన పారిశ్రామిక ప్రోత్సాహక చర్యలే కారణమన్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఇంకా అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టి జి ఐ ఐ సి చైర్మన్లు నిర్మల జగ్గారెడ్డి, గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, టీజీఐఐసి ఎండి శశాంక్ , మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ చైర్మన్ గిరీష్ జైన్,ఎండి సి.పి. రాంకా , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకల నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**- అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా.. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు**

**- ముస్లిం మత పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర): రాబోయే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పశువుల కొనుగోలు, రవాణా, వధ ప్రక్రియల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంతల్లో కొనుగోలు చేసిన పశువులకు సంబంధిత పశు వైద్య అధికారుల ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీస్, వెటర్నరీ అధికారులతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువుల వధ, అనుమతులు లేకుండా స్లాటర్ హౌస్ నిర్వహణ, ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా మాంసం విక్రయాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత సందేశాలు షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ పశువుల రవాణా గమనించిన వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 8712537826 లేదా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ 8712656410 కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ స్థాయిలో కరీంనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు

**- జిల్లా గ్రంథాలయం ద్వారా నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 15.లిప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవం.హాజరైన నగర మేయర్, సుడా చైర్మన్, గ్రంథాలయ చైర్మన్, అడిషనల్ కలెక్టర్‌లి హైదరాబాద్ స్థాయిలోనే కరీంనగర్ జిల్లాలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన అన్ని రకాల శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో విద్యారంగానికి అవసరమైన మౌలిక వసతులు, వనరులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ శిక్షణ కోసం యువత హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేలా జిల్లాలోనే ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని గ్రంథాలయ సంస్థ ద్వారా ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు జిల్లా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించిన కలెక్టర్, పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. యువతలో రీడింగ్ కల్చర్ మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి నగరపాలక సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన జిల్లా గ్రంథాలయానికి నూతన భవనం సిద్ధమైందని వెల్లడించారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ అవసరం ఉన్నా తమను సంప్రదించవచ్చని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ చదువుకు మనిషి గౌరవాన్ని, ఆర్థిక స్థితిగతులను మార్చగల శక్తి ఉందని అన్నారు. గ్రంథాలయం నాలెడ్జ్ హబ్‌లా పనిచేస్తోందని, విద్యార్థులు,నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు. తాను చదువుకునే రోజుల్లో నిత్యం పుస్తకాలు చదివేదాన్నని, వాటి ద్వారా ఎంతో జ్ఞానం పెరిగిందని చెప్పారు.పలువురు గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. జిల్లా కలెక్టర్, మేయర్, సుడా చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కలిసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ వారు అందించిన 8 కూలర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓకే మహేశ్వర్ స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లపల్లిలో అటవీ 'అగ్గి'.. రెవెన్యూ 'నీళ్లు'..

# బాధితులు మాత్రం సామాన్యులే

**-రెవెన్యూదా? ఫారెస్ట్‌దా? తేల్చని అధికారులు..**

**-అల్లపల్లిలో పడగవిప్పుతున్న భూదందా!**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో : జిల్లాలోని అల్లపల్లి మండలంలో భూ వివాదాలు నివురు గప్పిన నిప్పులా మారాయి. ఒకవైపు అటవీ శాఖ (ఫారెస్ట్) ఇది మా భూమి అంటూ హెచ్చరిక బోర్డులు పెడుతుంటే, మరోవైపు రెవెన్యూ వర్గాలు అది మా పరిధిలోనిదే అని సంకేతాలిస్తున్నాయి. ఈ రెండు శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపం అక్రమార్కులకు వరంగా, సామాన్య ప్రజలకు శాపంగా మారింది.




**హెచ్చరిక బోర్డులు ఉన్నా.. ఆగని అమ్మకాలు!**

అల్లపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని భూముల్లో అటవీ శాఖ అధికారులు "హెచ్చరిక" బోర్డులు ఏర్పాటు చేశారు. 1967 అటవీ చట్టం ప్రకారం ఇక్కడ భూములు కొనడం, అమ్మడం లేదా అక్రమ నిర్మాణాలు చేయడం నేరమని, జైలు శిక్ష తప్పదని బోర్డులపై స్పష్టంగా రాసి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. వేల, లక్షల రూపాయల చేతులు మారుతూ బహిరంగంగానే భూముల క్రయవిక్రయాలు సాగుతున్నాయి.

**అధికారుల ద్వంద్వ వైఖరి!**

బాధితులు అధికారులకు ఫోన్ చేసి అడిగితే.. ఒక శాఖ వారు తమదే అని, మరో శాఖ వారు తమదే అని సమాధానమిస్తున్నారు. కానీ, అక్రమంగా వెలుస్తున్న నిర్మాణాలను అడ్డుకోవడంలో గానీ, అమాయక ప్రజలు మోసపోకుండా స్పష్టమైన సరిహద్దులు నిర్ణయించడంలో గానీ అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. ప్రజల సూటి ప్రశ్న: "లక్షల రూపాయలు వెచ్చించి భూమి కొన్న తర్వాత, అది ఫారెస్ట్ భూమి అని రేపు అధికారులు జెసిబిలతో వస్తే మా గతి ఏమిటి? మా కష్టార్జితానికి భద్రత ఏది?"

**చోద్యం చూస్తున్న యంత్రాంగం!**

అల్లపల్లి మండలంలో ఇంత పెద్ద ఎత్తున భూదందా సాగుతున్నా ఉన్నతాధికారులు మౌనం వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు శాఖల మధ్య పడి సామాన్యులు నలిగిపోవాల్సిందేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డిమాండ్:**

వెంటనే జిల్లా కలెక్టర్ మరియు అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, అల్లపల్లి మండలంలో వివాదాస్పదంగా ఉన్న భూములపై జాయింట్ సర్వే నిర్వహించాలి. అది ఏ శాఖ భూమి అన్నది బహిరంగంగా ప్రకటించి, అమాయక ప్రజలు అక్రమార్కుల చేతిలో మోసపోకుండా చూడాలి.

**ముగింపు వ్యాఖ్య:**

"శాఖల మధ్య పోరు.. అక్రమార్కుల జోరు! అల్లపల్లి భూముల పంచాయితీ తేలేది ఎప్పుడు? సామాన్యుడికి న్యాయం జరిగేది ఎప్పుడు?"

# పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కి చోటు

## - తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం



వరంగల్ జిల్లా ప్రతినిధి మే15(విజన్ ఆంధ్ర); హక్కులు, సంక్షేమం, సాధికారతకు సంబంధించిన అంశాలపై కీలక సూచనలు చేసే పార్లమెంటరీ మహిళా సాధికారత స్థాయి కమిటీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య సభ్యురాలిగా నియమితులయ్యారు. లోక్‌సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక కమిటీకి సీనియర్ పార్లమెంటేరియన్ పురందేశ్వరి అధ్యక్షత వహించనున్నారు. లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన మహిళా ఎంపీలు కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు. మహిళల భద్రత, విద్య, ఆర్థిక స్వావలంబన, ఉద్యోగావకాశాలు, లింగ సమానత్వం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయనుంది. మహిళా సాధికారత కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని సమీక్షించడంతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంపు, విధానాల సమర్థ అమలు, మహిళా హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య గారికి ఈ కీలక కమిటీలో చోటు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. మహిళా సమస్యలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి ఉన్న అవగాహన, సామాజిక అంశాలపై చూపుతున్న చొరవ దృష్ట్యా కమిటీలో ఎంపీ డా.కడియం కావ్య సేవలు కీలకంగా ఉండనున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక పురోగతికి సంబంధించిన అంశాలను కమిటీలో బలంగా ప్రస్తావిస్తానన్నారు. మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ, ముఖ్యంగా వరంగల్ ప్రాంత మహిళల సమస్యలు, అవసరాలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా తన వంతు కృషి కొనసాగుతుందని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

విజన్ ఆంధ్ర(16) హైదరాబాద్ :ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలుత్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**కమిటీ చైర్మన్‌గా కే. కేశవరావు**

ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీవిప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.

**త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశం**

కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఇష్టమున్నట్టు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు - మల్కాజ్గిరి సిపి సుమతి

**సురక్షిత డ్రైవింగ్ సేవలకు ఆటో డ్రైవర్ రమణయ్యను సన్మానించిన పోలీస్ శాఖ**







విజన్ ఆంధ్ర(16) హైదరాబాద్ : కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీమతి బి. సుమతి ఐపీఎస్ మరియు ట్రాఫిక్-1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె. రాహుల్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తిరుమలగిరి పరిధిలోని బోయిన్పల్లి మార్కెట్లో శుక్రవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈకార్యక్రమంలో బోయిన్పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు, డ్రైవర్లు, రైడర్లు పాల్గొన్నారు, ఈసందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ తిరుమలగిరి డివిజన్ జి. శంకర్ రాజు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు, హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, మైనర్లతో వాహనాలు నడపించకుండా ఉండడం, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పని సరిగా పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు, బాధ్యతా యుతమైన డ్రైవింగ్ అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు, అలాగే గత 30 సంవత్సరాలుగా ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా ఆటో నడుపుతున్న ఆటో డ్రైవర్ రమణయ్యని ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు, ఈకార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తిరుమలగిరి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ వి. సర్దార్ నాయక్, ఆర్ఐ శ్రీ ఐ.వి. రమణయ్య, మరియు ఎస్ఐలు పాల్గొన్నారు

# పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలి

**- ఎస్సీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- ఖాళీ సీట్ల భర్తీకి అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని సూచన**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు లక్ష్యంతో, ప్రణాళికాబద్ధంగా చదివితేనే విజయాన్ని అందుకోవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా శాఖ వారోత్సవాల్లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల ఉచిత కోచింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు స్టడీ సర్కిల్ ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇచ్చారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్టడీ సర్కిల్‌లో అందిస్తున్న రెసిడెన్షియల్ ఉచిత కోచింగ్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకొని క్రమశిక్షణతో చదవాలని తెలిపారు. రోజూ దినపత్రికలు చదివే అలవాటు పెంచుకోవాలని, తద్వారా సమకాలీన అంశాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎక్కువ సమయం చదువుతో పాటు రివిజన్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఖాళీగా ఉన్న సీట్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు సిరిసిల్లలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, స్టడీ సర్కిల్ హానరరీ డైరెక్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు - కలెక్టర్ కె హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే-15 విజన్ ఆంధ్ర గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు పుస్తకాలను చదవడం ద్వారా ఉద్యోగ ఉపాధి మార్గాలె కాకుండా జ్ఞానవికాసంతో మధురానుభూతి ఆనందం పొందడానికి ఉపయోగపడుతుందని యువత పుస్తకాలు చదవడం తప్పని సరిగా అలవర్చుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రజాపాలనప్రగతిప్రణాళిక కార్యక్రములో భాగంగా విద్యా వారోత్సవాల కార్యక్రమములో భాగంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయ దినోత్సవము కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కమదే అనిల్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు జిల్లా విద్యా శాఖా అధికారి లలితతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని అన్నారు గ్రంథాలయాలను నేటి యువత తప్పనిసరిగా రావాలన్నారు గ్రంథాలయాలలో ఎన్నో నవలలు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలు గొప్ప వారి చరిత్రకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో వుంటాయన్నారు ప్రభుత్వ ఉద్యోగాల కొరకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు చక్కని వేదిక అని అన్నారు గ్రంథాలయాల అభివృద్ధి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు ఈ సందర్భంగా ఈ గ్రంథాలయములో సన్నద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని శాలువాతో సన్మానం చేశారు కవులను సన్మానం చేశారు ఈ కార్యక్రమములో కౌన్సిలర్లు జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు పాఠకులు, కవులు తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాం సిద్దంగా వుండాలి

**- కలెక్టర్ కె హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే-15 విజన్ ఆంధ్ర వచ్చే వర్ష కాలంలో వరదలు విపత్తుల వల్ల ఆస్తులు ప్రాణ నష్టము జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు న్యూ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డెవిడ్ కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య తో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమతంగా వుండాలన్నారు భారి అతి భారి వర్షాలు కురిసే సమయంలో వరదలు వచ్చి జన వసనం స్తంభించి పోతుందని ఆ సమయంలో ప్రజలను రక్షించి వారికి పునర వాసకే ఏర్పాట్లు చేపట్టాలన్నారు జిల్లాలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు వరదలు వచ్చే సమయంలో ప్రజను అప్రమత్తం చేయాలన్నారు జిల్లాలో విపత్తులు సంభవించి నప్పుడు ప్రజలను రక్షించడానికి రేస్కు బృందాలు సిద్దంగా ఉండాలన్నారు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం త్రాగునీరు వైద్య చికిత్సలు అందించాలన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్, అగ్నిమాపక, నీటిపారుదల శాఖ, అధికారులు పాల్గొన్నారు

## శనగాని రాంబాబుకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలి..



సూర్యాపేట మే 15:(విజన్ ఆంధ్ర) : సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనగాని రాంబాబు గౌడ్ కు పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని సూర్యాపేట జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్గూరి పాండు గౌడ్, మైనార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా వైస్ చైర్మన్ ఎస్ఎస్ సాజిద్, సూర్యాపేట ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడుగుంట్ల గోవర్ధన్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రం వాణిజ్య భవన్ సెంటర్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శనగాని రాంబాబు గౌడ్ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని, ఆయనకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు సహాయం చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇస్తే పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తుందని, సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సుమారు 28 వేల ఓట్లు ప్రభావితం చేసే స్థాయిలో ఆయనకు ప్రజాదరణ ఉందని తెలిపారు. పేదల పక్షాన నిలబడే నాయకుడిగా రాంబాబు గుర్తింపు పొందారని, ఎలాంటి ఆపద వచ్చినా ప్రజలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. పార్టీ బలోపేతానికి ఆయన సేవలు ఎంతో ఉపయోగపడతాయని, అందువల్ల ఆయనకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని కోరారు.

# బావిలో పడి వృద్ధురాలు మృతి..



భూపాలపల్లి జిల్లా,రేగొండ,మే 15 (విజన్ ఆంధ్ర ) : రేగొండ మండలం రేపాక గ్రామానికి చెందిన బండి ఓదమ్మ(67) కడుపునొప్పి అనారోగ్య సమస్యల కారణంగా కారణంగా శనివారం ఉదయం బావిలో పడి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం మృతురాలికి గత ఎనిమిది నెలల నుండి అనారోగ్య సమస్యలతో,కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో అందరూ భోజనం చేసి పడుకున్న తర్వాత శనివారం తెల్లవారుజామున ఉదయం మూడున్నర గంటలకు మృతురాలు కోడలు ఇంట్లో చూసేసరికి మృతురాలు కనబడబోయేసరికి కోడలు, కొడుకు, బంధువులు చుట్టుపక్కల వెతకగా రేపాక గ్రామ శివారులోని పైడిపల్లి ఓదెలు వ్యవసాయ బావిలో పడి చనిపోయి ఉన్నది. మృతురాలు కడుపునొప్పి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితం పై విరక్తి చెంది బావిలో పడి ఉదయం ఐదున్నర గంటల సమయంలో చనిపోయినది. మృతురాలు మరణం పై ఎవరిపై ఎటువంటి అనుమానం లేదని ఫిర్యాదుదారుడు మృతురాలి కొడుకు బండి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి సుధాకర్ తెలిపారు.

## సంగారెడ్డిలో టీజీఐఐసీ కార్యాలయం ప్రారంభోత్సవం

**-హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ**

సంగారెడ్డి, మే, 15(విజన్ ఆంధ్ర బ్యూరో ) : సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ నగర్ లో టీజీఐఐసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు. మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఎస్పీ పరితోష్ పంకజ్ , జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ , నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా అధికారులు



కామారెడ్డి బ్యూరో మే 15 (విజన్ ఆంధ్ర) : అత్యవసర పరిస్థితులు, విపత్తు సందర్భాల్లో జిల్లా స్థాయి సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం, స్పందన వ్యవస్థలను సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కోసం రాష్ట్రస్థాయి టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించింది. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఐడీఓసీసీ కలెక్టరేట్, కామారెడ్డి నుండి ఆన్‌లైన్ విధానంలో ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంది. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆన్‌లైన్ ద్వారా టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొని జిల్లా సన్నద్ధత చర్యలను సమీక్షించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో శాఖల పాత్రలు, బాధ్యతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో శాఖల మధ్య సమన్వయం, విపత్తు స్పందన వ్యవస్థలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర సన్నద్ధత, సహజ, మానవసృష్టి విపత్తుల సమయంలో తక్షణ స్పందనపై ప్రధానంగా దృష్టి సారించారు. అధికారులు వివిధ అత్యవసర పరిస్థితులను ఊహించి, వాటికి అనుగుణంగా స్పందన వ్యూహాలపై చర్చించి జిల్లాలో సమర్థవంతమైన విపత్తు నిర్వహణకు చర్యలను సమీక్షించారు. ఇలాంటి టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌లు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితులు, విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి సన్నద్ధతను పెంపొందించడంలో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న బిజెపి ప్రభుత్వం

**- పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను కేంద్రం నియంత్రించాలి**

**- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**- హనుమకొండలో సీపీఐ వినూత్న నిరసన**



హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 15 ( విజన్ ఆంధ్ర ) : పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రో ధరల పెంపుతో రవాణా,నిత్యావసర సరుకులు,కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పది రోజుల క్రితం వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్ ధరలను భారీగా పెంచి కనికరం లేకుండా సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డిజిల్ ధరలను వెంటనే తగ్గించని ఎడల ప్రజా గ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి.విజయసారధి,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్,కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

**- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్**

**- హనుమకొండ కాళోజీ సెంటర్ లో సిపిఐ రాస్తారోకో**




హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 15 ( విజన్ ఆంధ్ర ): పోక్సో కేసులో తన కొడుకును రక్షించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కాళోజీ సెంటర్ లో సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని,ఇటీవల 17 ఏళ్ల మైనర్ బాలికపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ మద్యం తాగించి, కొన్నిసార్లు డ్రగ్స్ ఇచ్చి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు పెట్టడం జరిగిందని అన్నారు. బండి సంజయ్ తన కుమారున్ని రక్షించు కొనే ప్రయత్నం చేస్తూ కేసును నిరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి భగీరథ ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తండ్రి హోం సహాయ మంత్రిగా ఉండడం వలన పోలీసు యంత్రాంగాన్ని ప్రధాన మీడియాను మేనేజ్ చేస్తూ కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వెంటనే బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేస్తే కేసును నిష్పక్షపాతంగా నమోదు కావడానికి అవకాశం ఉంటుందని డిమాండ్ చేసినారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోని నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి.విజయసారధి,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్,కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుస్తక పట్టణం ద్వారానే నిరంతర విజ్ఞానం సాధ్యం

**- వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై.వి గణేష్**



వరంగల్ జిల్లా ప్రతినిధి మే15(విజన్ ఆంధ్ర) : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికల 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలలో బాగంగా శుక్రవారం జిల్లా కేంద్రం లోని గ్రంథాలయం లో గ్రంథాలయ దినోత్సవ కార్యక్రమము నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్.బి) వై.వి. గణేష్ పాల్గొని విద్యార్థుల మద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తమ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను నిరంతరం సందర్శిస్తూ పుస్తకాలు చదిని విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంపుదించుకోవాలని ఆయన కోరారు. ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లకు అలవాటు పడి గ్రంథాలయాలు నిర్లక్ష్యం చేస్తున్నారు కానీ మన దేశ జాతీయ నాయకులు గాంధీ, అంబేద్కర్, స్వామివివేకానంద వంటి వారు కూడా గ్రంథాలయాల నుండే పుస్తకాలు చదివి మహానుభావులుగా ఎదిగారని కాబట్టి అట్టివారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో మనం కూడా ఆదర్శవంతంగా ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రంగయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించడానికి సమయము వెచ్చించి తద్వారా అన్ని రకాలైన పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎమ్ఇఓ వెంకటేశ్వరావు, మట్టెవాడ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, కె అరుణ, సిబ్బంది ఎమ్ చిన్నబాబు, లిలిత, రజిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో మాక్ డ్రిల్స్ స్పందన కీలకం

**దాసరి హరిచందన ఐఏఎస్, కార్యదర్శి, రెవెన్యూ డి.ఎం.**



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 15 ( విజన్ ఆంధ్ర ) : వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో మాక్ డ్రిల్స్ కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌కు సంబంధించి పలు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు మరియు జిల్లాల యంత్రాంగంతో శుక్రవారం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రిటైర్డ్ మేజర్ జనరల్ సుధీర్ బాహల్, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ లతో కలిసి రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్ సెక్రటరీ దాసరి హరిచందన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 18న వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లు జరగనున్నాయి తెలిపారు. 2025 డిసెంబర్ లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల నుండి త్వరిత స్పందన మరియు సమన్వయ సేవలను నిర్ధారించడంలో ఎంతో ఉపయోగపడ్డాయని కార్యదర్శి అన్నారు. ఇటువంటి మాక్ డ్రిల్స్ క్షేత్ర స్థాయిలో లోపాలను గుర్తించడంలో సహాయపడతాయని మరియు శాఖలు క్రమబద్ధమైన పద్ధతిలో ప్రణాళిక మరియు సంసిద్ధతను మెరుగుపరచు కోవడానికి అవకాశం కల్పిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ మే 18న జరిగే వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌లలో దాదాపు 60 శాఖలు మరియు కేంద్ర ఏజెన్సీలు పాల్గొంటాయని చెప్పారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ( ఎన్డిఎంఎ ) సహకారంతో తెలంగాణ 2025 డిసెంబర్‌లో వరదలు మరియు పారిశ్రామిక ప్రమాదాలపై మొదటిసారి మాక్ డ్రిల్స్ నిర్వహించిందని, ఇది అంతర్–శాఖ సంసిద్ధతను మరియు విపత్తులకు త్వరిత స్పందనను గణనీయంగా బలోపేతం చేసిందని ఆయన అన్నారు. 2026 సంవత్సరానికి వరదల సంబంధిత మాక్ డ్రిల్స్ 13 జిల్లాల్లో, పారిశ్రామిక ప్రమాద డ్రిల్స్ ఐదు జిల్లాల్లో మరియు అటవీ అగ్ని మాక్ డ్రిల్స్ నాలుగు జిల్లాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్సర్‌సైజ్‌ల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అన్ని శాఖలను ఆయన ఆదేశించారు. న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న ఎండిఎంఎ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బాహల్ (రిటైర్డ్ మేజర్ జనరల్), వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని పరిస్థితుల సమయంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల పాత్రలు మరియు బాధ్యతలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. 18న జరిగే రాష్ట్ర స్థాయి మాక్ డ్రిల్స్ ఏర్పాట్లకు సంబంధించి ఆయన అనేక సూచనలు కూడా చేశారు. ఈ ప్రజెంటేషన్‌లో అంతర్–శాఖ సమన్వయం, ప్రణాళిక, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్ మార్గదర్శకాలు, సహాయ శిబిరాల ఏర్పాటు, ఆసుపత్రి సంసిద్ధత, అటవీ అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గూర్చి వివరించడం జరిగింది. హనుమకొండ కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యా రు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ భూక్య సంజీవ్, డీడబ్ల్యూవో విశ్వజ, మెప్మా కోఆర్డినేటర్ రజిత రాణి, హనుమకొండ ఏసిపి నరసింహారావు, జి డబ్ల్యూ ఎం సి అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ లింగం, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి రవి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లమందు, ఎండు గంజాయి పట్టివేత



ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర) : శుక్రవారం నాడు ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ సీఐ సిహెచ్.శ్రీనివాస్ , సిబ్బంది కలిసి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కపిల్ భవన్ ఎదురుగా ఉన్న నిర్మానుశ్య ప్రదేశంలో అక్రమంగా ఓపియం(నల్ల మందు) , గంజాయి వినియోగం జరుగుతున్నదనే ఖచ్చితమైన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు . అక్కడ రాజస్థాన్ కు చెందిన రన్వీర్ సింగ్ వద్ద 7.6 గ్రాముల ఓపియం (నల్లమందు) మరియు 4.3 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. అతనికి స్పాట్ లోనే డ్రగ్ టెస్ట్ నిర్వహించగా ఓపియం పాజిటివ్ గా నిర్ధారణ అయినదని, తదుపరి అక్కడే ఉన్న గుర్రాలపాడు గ్రామానికి చెందిన ఎస్ కె . కరీం పాషా అను వ్యక్తి మత్తు లో తూలుతూ ఉండగా అతనికి స్పాట్ లోనే డ్రగ్ టెస్ట్ నిర్వహించగా గంజాయి పాజిటివ్ గా నిర్ధారణ అయినది ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ముద్దాయిలను , టెస్ట్ చేసిన యూరిన్ 2 కిట్ లు , 7.6 గ్రాముల ఓపియం మరియు 4.3 గ్రాముల ఎండు గంజాయిని ఖమ్మం-2 ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ జమాల్ షరీఫ్, కానిస్టేబుల్స్ వీరబాబు, ప్రసన్న కుమార్,తిరుపతి, డ్రైవర్ లు సాయిరాం,రాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏదైనా మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించాలని సిఐ సీహెచ్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పెట్రోల్ ధరలు మూడు రూపాయలు పెంచిన బిజెపి ప్రభుత్వం

**-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



సంగారెడ్డి, మే, 15(విజన్ ఆంధ్ర బ్యూరో ): బిజెపి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందని పెట్రోల్ ధరలు ఒకే సారి 3 రూపాయలు పెంచారని పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం నాడు నిర్మల జగ్గారెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 4 రాష్ట్రాల ఎన్నికల సమయంలో ధరలు పెంచలేదని ఎన్నికల తర్వాత వసూళ్ళు మొదలు పెట్టారు అని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి దేశ అభివృద్ధిపై బిజెపి మాట్లాడుతుంది అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు పెరిగినప్పుడు ధరలు పెంచితే సామాన్యులు అర్థం చేసుకుంటారు అని అన్నారు. మరి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రో ధరలు బిజెపి ప్రభుత్వం ఎందుకు తగించలేదు అని అన్నారు. ఇది మొదలు మాత్రమేనని చెప్పి బిజెపి అసలు రూపం చూపెడుతుందని తెలంగాణ ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బిజెపి టార్గెట్ అన్నారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం పని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ అని తెలిపారు. సీఎం, మంత్రులు అందరం కలిసి పని చేస్తున్నాం సీఎం నేతృత్వంలో ఒక్కతాటిపై ఉన్నాం క్యాబినేట్ లో అందరం కలిసి నిర్ణయాలు తీసుకుంటాం అని తెలిపారు. ఎన్నడూలేని విధంగా ఈ సారి ధాన్యం మార్కెట్లోకి వచ్చింది కొన్ని సందర్భాల్లో లారీలు లేట్ గా వస్తే దాన్ని అదనుగా తీసుకుని ఆందోళనలు చేస్తున్నారు. రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కుబి ఆర్ యస్ కి లేదు అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దు చివరి గింజ వరకు ప్రభుత్వమే కొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షట్కార్, టీ జి ఐ ఐ సి ఛైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి సమాజాన్ని వెలిగించండి

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**




మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి మే.15.(విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో శుక్రవారం ఐదవ రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి సమాజాన్ని వెలిగించండి అని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని సంపాదించాలని మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలని మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో , గ్రంథాలయ పాఠకులకు కావలసిన వసతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పాఠకులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు, సమాజ అభివృద్ధి కి విద్య ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ఉన్నంత లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీనియర్ పాఠకుడు టీవీ రామనర్సయ్య, డిఎస్ఓ అప్పారావు , ఏ సి జి, మందుల శ్రీరాములు, ఏ ఎస్ సి సంతోష్, ముక్క లక్ష్మణరావు, నరసింగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ గ్రంథపాలకులు, జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్ ,భూలక్ష్మి, యాదమ్మ బాబా , పుస్తక ప్రియులు , పాఠకులు , విద్యార్థిని విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల మరణాల నివారణకు సమిష్టి కృషి అవసరం

**- జిల్లా డీఎంహెచ్‌వో డా. తుకారాం రాథోడ్**



కొత్తగూడెం బ్యూరో, మే 16(విజన్ ఆంధ్ర) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు, జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనైజేషన్ అధికారి డా. ప్రతాప్ సమక్షంలో శుక్రవారం జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన చిన్నారుల మరణాలపై "చైల్డ్ డెత్ రివ్యూ" సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, మరణాలకు దారితీసిన కారణాలపై సమీక్ష చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమలు చేయాల్సిన చర్యలపై వైద్య అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ మాతృ, శిశు మరణాల నివారణకు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు ప్రసవానంతరం పిల్లలు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ, పోషకాహార సూచనలు, వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సీహెచ్‌వో నాగభూషణం మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణపై టేబుల్ టాప్ ఎక్సర్సైజ్

**- మే 18న బూర్గంపాడులో మాక్ ఎక్సర్సైజ్**



కొత్తగూడెం బ్యూరో, మే 16(విజన్ ఆంధ్ర) : జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఏ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణతో పాటు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టేబుల్ టాప్ ఎక్సర్సైజ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి విద్యా చందన, సీఆర్పీఎఫ్ కమాండెంట్ రితికేష్ ఠాగూర్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతి కుమార్‌తో పాటు అటవీ, పోలీస్, రెవెన్యూ, ఎస్‌డీఆర్‌ఎఫ్, సాగునీటి శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర విభాగాల అధికారులు ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్ మాట్లాడుతూ జిల్లాల్లో వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు లేదా ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం వేగంగా, సమన్వయంతో స్పందించేందుకు ముందస్తు సిద్ధత అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరద ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, సహాయక చర్యలు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అటవీ అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించిన సమయంలో వివిధ శాఖల సమన్వయం, అగ్నిమాపక చర్యల అమలుపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 18న బూర్గంపాడు మండలంలో నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్‌ను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎన్‌డిఎంఏ ప్రతినిధులు సూచించారు. మాక్ డ్రిల్‌కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలి

**- మిల్లుల్లో అన్‌లోడింగ్ ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోండి**

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశాలు**



ఇల్లంతకుంట / బోయినిపల్లి / ఎల్లారెడ్డిపేట, మే 15 (విజన్ ఆంధ్ర): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించి, అక్కడ అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్ మిల్, రహీంఖాన్‌పేట వ్యవసాయ మార్కెట్ గోదాం, అలాగే పొత్తూరు, మాన్వాడ, కొదురుపాక, వెంకటాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్ యజమానులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, తూకం పూర్తైన ధాన్యం బస్తాలను ఆలస్యం లేకుండా వాహనాల ద్వారా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు తగిన సంఖ్యలో వాహనాలు అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే వినియోగంలో లేని గోదాములను సిద్ధం చేసి ధాన్యం నిల్వకు ఉపయోగించుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచి వాహనాల్లోని ధాన్యం బస్తాలను వేగంగా అన్‌లోడ్ చేయాలని, పర్యవేక్షణ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్లు సురేష్, షరీఫుద్దీన్, సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఆర్యవైశ్య మహాసభ పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నికలు..



సూర్యాపేట మే 15:(విజన్ ఆంధ్ర) : ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు మరియు ఎన్నికల నిర్వహణ బాధ్యతను చేపట్టే ఆర్యవైశ్య ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోటీ చేసే అభ్యర్థులు నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు ఐదు వేల రూపాయలు డిపాజిట్ చేయాలని అన్నారు. నామినేషన్ పత్రంలో వున్న వివరాలను పూర్తి చేయాలని , నామినేషన్ పత్రంలో కోరిన విధంగా తగిన ఆధారాలు సమర్పించాలని అన్నారు. పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నిక 31 మే, 2026 తేదీన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయము ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.. ఎన్నికల సమయంలో అందరూ సంయమనం పాటించాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలని అన్నారు. సెల్ ఫోన్ లు తీసుకొని ఎవరు రాకూడదని తెలిపారు. ఓటు వేయడానికి ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకుని రావాలని అన్నారు. నియమావళిని అతిక్రమిస్తే తగిన చర్యలు చేపడుతామని తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు తటస్థంగా వుండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ కాపీలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, మాజి జిల్లా అధ్యక్షులు కర్నాటి కిషన్, జిల్లా క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, పట్టణ అధ్యక్షులు మంచాల రంగయ్య, నాయకులు తోట శ్యామ్ ప్రసాద్, రాచర్ల కమలాకర్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, తప్పి గాంధి, గుండా శ్రీధర్, కొండా శ్రీనివాస రావు, విశ్రాంత ఉపాధ్యాయులు గుండా రమేష్, పి వి లక్ష్మీనారాయణ, దేవరశెట్టి జనార్ధన్, వనమాల వెంకటేశ్వర్లు, జల్లిగప్పు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపల్లి హెచ్‌ఎం ఉమాదేవి పై చర్యలు తీసుకోవాలి..



భూపాలపల్లి జిల్లా, గోరి కొత్తపల్లి మే 15( విజన్ ఆంధ్ర ).. గోరుకొత్తపల్లి మండలంలో ని నిజాంపల్లి ప్రభుత్వ ప్రధానోపాధ్యాయు రాలు ఉమాదేవి పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బిఎస్ఎఫ్ నాయకులు డి ఈ ఓ రాజేందర్ కు బిఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజేందర్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపల్లి ప్రభుత్వ హెచ్‌ఎం ఉమాదేవి అనేక అవకతలకు పాల్పడ్డారని వారిపై సమగ్ర విచారణ గారికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన వినతి పత్రంలో కోరారు.

# లింగాల రైస్ మిల్ వద్ద మక్కల దిగుమతి పై రైతుల ఆందోళన..

**- రైతులతో కలిసి మిల్లు వద్ద రోడ్డుపై ధర్నా రాస్తారోకో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..**

**- దిగుమతికి హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించలేదని తేల్చి చెప్పిన గండ్ర..**





భూపాలపల్లి జిల్లా,రేగొండ, మే 15 (విజన్ ఆంధ్ర ).. రేగొండ మండలంలోని లింగాల రైస్ మిల్ వద్ద శనివారం రేగొండ బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో లింగాల కాకర్లపల్లి ప్రధాన రహదారి లో రైస్ మిల్ వద్ద రోడ్డుపై టిఆర్ఎస్ కార్యకర్తలు రైతులతో కలిసి మొక్కలు దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హాజరై ధర్నా రాస్తారోకో కార్యక్రమంలో రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించి పంట చేతికి వచ్చినాక అమ్మడానికి ప్రభుత్వం అనేక రకాల కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు మాత్రమే రైతులు తమ పంటలను తీసుకొని కాంటా అనంతరం ట్రక్ సీట్ తీసుకొని వెళ్లాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అది ఎక్కడ అమలు కావడం లేదని ఆయన విమర్శించారు. రైతులు తమ పంట ను కల్లాల వద్ద తీసుకొని వచ్చి ఆరబోసి తన సొంత డబ్బులతోనే గన్నిబాగులు కొనుగోలు చేసి తన సొంత ఖర్చులతో ప్రైవేటు వాహనాలలో దిగుమతి కేంద్రాలకు తీసుకొని వచ్చిన దిగుమతి చేసుకునే నాధుడే లేదని అన్నారు. రైతులు ఒక్కో ట్రాక్టర్ కు రోజుకు రూపాయలు 2000 చొప్పున కిరాయి చెల్లిస్తూ దిగుమతి కేంద్రాల వద్దకు తీసుకెళ్తే గత ఆరు రోజులుగా దిగుమతి కాలేదని, రైతులు కాకుండా మధ్య దళారీలు తీసుకొచ్చిన ట్రాక్టర్లను దిగుమతి చేసుకుంటూ రైతుల ట్రాక్టర్లను అలాగే ఉంచుతున్నారని అలా ఆరు ఏడు రోజుల నుండి పడిగాపులు కాస్తున్న దిగుమతి చేసుకునే నాధుడే లేదని అధికారులను అడిగితే మాకేం తెలియదని హమాలీలు లేరని వివిధ రకాల కారణాలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఈ విధంగా రైతులకు పని భారం పడుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం పి ఎ సి ఎస్ అధికారులు గుర్తించి రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని ఆయన రైతుల తరఫున కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు అంకం రాజేందర్, బండి రమేష్ బిజెపి జిల్లా నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, రేపాక, రామన్నగూడెం తండా టిఆర్ఎస్ సర్పంచులు ఐలయ్య సార్, బీక్యా నాయక్, కిషన్ రావు వివిధ గ్రామాల టిఆర్ఎస్ కార్యకర్తలు రైతులు, ట్రాక్టర్ డ్రైవర్ పాల్గొన్నారు.

# గ్రంథాలయాలే విజయానికి మార్గదర్శి

**- పట్టుదలతో చదివితే ఉన్నత ఉద్యోగాలు సాధ్యం**

**- విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనలు**






రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా శు క్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను, విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచిన ప్రత్యేక పుస్తకాలను, మానసిక ఉల్లాసానికి ఏర్పాటు చేసిన ఆటల పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైబ్రరీలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత రోజువారీ వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేసే సోషల్ మీడియాకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని చదివితే విజయాన్ని అందుకోవచ్చని చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టడం జరిగిందన్నారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను నమోదు చేసి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే వచ్చే వారం యువజన మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వాకథాన్, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడిస్తూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో టాస్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా గ్రంథాలయాల్లో చదివి ఇప్పటికే అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి లైబ్రరీలో ఘనంగా విద్యా వారోత్సవాలు .



భూపాలపల్లి జిల్లా మే 15 (విజన్ ఆంధ్ర ) గ్రంథాలయంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ, విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకు వచ్చిందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రంథాలయంలోని పుస్తకాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు, యువత పుస్తక పఠన అలవాట్లను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ తరుపున తనవంతు సహాయం సహకారాలు అందిస్తానని ఆయన చెప్పారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాదని, అవి జ్ఞాన వికాసానికి ప్రధాన కేంద్రాలని పేర్కొన్నారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. పాఠకులు, యువత కోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం లైబ్రరీలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పుస్తకాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రంథాలయంలో బెస్ట్ పాఠకురాలును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ముద్దమల్ల రాజేందర్, కౌన్సిలర్లు బొద్దు అశోక్, రాధ, నాయకులు చల్లూరి సమ్మయ్య, చల్లూరి మధు, వివిధ సంఘాల నాయకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి..

**- తూర్పు తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు**

**- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య**



సూర్యాపేట మే 15:(విజన్ ఆంధ్ర) : స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం తూర్పు తెలంగాణా ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని దేవి, సభ్యురాలు సుజానా యాదవ్, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తమతమ జిల్లాలలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు,గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు.

**గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి..**

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలోని గ్రామాలను, మున్సిపాలిటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి జరిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యం రావడమే అసలైన లక్ష్యమని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి ప్రతి గ్రామం, మున్సిపాలిటీని ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయడం ద్వారా గ్రామాలు బలోపేతం అవుతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా స్థానికంగా ఆదాయం పెరిగేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు నిధులు అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్నులు కట్టేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసి గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా యంత్రాంగం పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నగర మేయర్లు, ఛైర్పర్సన్ లు, ఎక్స్ ఎం.పి.టి.సి.లు, ఎక్స్ జడ్.పి.టి.సి లు సర్పంచులు, మునిసిపల్ కమీషనర్ లు, డిపిఓ లు, ఎంపిడిఓ లు, ఎన్జిఓస్, సూర్యాపేట అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, నల్గొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,సూర్యాపేట జెడ్పీ సీ.ఈ.ఓ డి. శిరీష, నల్గొండ జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీఓ యాదగిరి, డిఎంహెచ్వో వెంకటరమణ డీఎల్పీఓలు, ఎంపీఓలు, ఎంఈఓ లు గ్రామపంచాయతి కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

**సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



కొత్తగూడెం బ్యూరో, మే 16 (విజన్ ఆంధ్ర): రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, వారికి నష్టం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి రైతులతో సమావేశమైన ఎస్పీ, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు గన్నీ బ్యాగుల కొరత, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా, ధాన్యాన్ని కప్పి ఉంచేందుకు అవసరమైన తార్పాలిన్ పట్టాల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలగకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులతో పాటు పోలీసులకు కూడా సమాచారం అందించాలని రైతులను కోరారు. అనంతరం ఎస్పీ అక్కడ జరుగుతున్న ధాన్యం కొనుగోలు విధానం, ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమాదేవి, రవి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**- జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 15 ( విజన్ ఆంధ్ర ) : ఎడ్యుకేషన్ వీక్ సందర్భంగా "లైబ్రరీ డే" ఘనంగా నిర్వహించామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాలలో భాగంగా ఎడ్యుకేషన్ వీక్ సందర్భంగా 2026 మే 15 శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో "లైబ్రరీ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జ్ఞానానికి నిలయమైన గ్రంథాలయాల ప్రాముఖ్యతను సమాజానికి చాటిచెప్పే విధంగా ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి మండల విద్యాధికారి యన్. బాబు సింగ్ హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. విద్యార్థులు, ఉద్యోగార్థులు గ్రంథాలయ వనరులను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి" అని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధి, పాఠశాల స్థాయిలో పఠన సంస్కృతి బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి రేణుకా దేవి గారు మాట్లాడుతూ, గ్రంథాలయంలో చదవడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత పెంపొందుతుందని, తద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా సాధించగలరని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు సహకరిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు మాట్లాడుతూ, 1959 సంవత్సరం నుండి 2026 వరకు జిల్లా గ్రంథాలయం సాధించిన ప్రగతిని వివరించారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉద్యోగార్థులు, విద్యార్థుల కోసం మెరుగైన మౌలిక వసతులు, ప్రశాంత పఠన వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. గ్రంథాలయాన్ని విజ్ఞాన దేవాలయంగా భావించి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుంటే విజయం సాధ్యం అవుతుందని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన సుమారు 13 మందిని ఘనంగా సన్మానించారు. తరచుగా గ్రంథాలయాన్ని వినియోగిస్తున్న పాఠకులను కూడా అభినందించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలను ఇతర చదువరులతో పంచుకుంటూ, గ్రంథాలయం విజయానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా మండల విద్యాధికారి యన్. బాబు సింగ్ వ్యవహరించగా, కార్యక్రమ వ్యాఖ్యాతగా ఎం. అశోక్ సేవలందించారు. చివరగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు సభకు విచ్చేసిన అతిథులు, అధికారులు, పాఠకులు, విద్యార్థులు, ఉద్యోగార్థుల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది అరవింద్, స్రవంతి, సరిత, విద్యాశాఖ సిబ్బంది, సుమారు 100 మంది ఉద్యోగార్థులు, విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 17 న హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలి

**- హిందూ సమ్మేళనం సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 15,(విజన్ ఆంధ్ర ) : ఈనెల 17 ఆదివారం రోజున మంచిర్యాల పట్టణంలోని టూ టౌన్ ప్రాంతం లోగల శివాజీ గ్రౌండ్ లో హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని హిందూ సమ్మేళనం సమితి టూ టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హమాలీవాడ శ్రీ హనుమాన్ సాయి ఆలయం లో హిందూ సమ్మేళనం సమావేశంను ఏర్పాటు చేశారు. ముందుగా సమ్మేళనం పోస్టర్లు, కర పత్రాలను 56,39 డివిజన్ ల కార్పొరేటర్లు నల్ల శంకర్, పూదరి సునీత ప్రభాకర్, సమ్మేళనం సమితి ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల టూ టౌన్ లోని హమాలీవాడ, రాజీవ్ నగర్,దొరగారిపల్లి, గోపాల వాడ,తిలక్ నగర్, సూర్య నగర్, చున్నంబట్టివాడ, అశోక్ రోడ్డు, భగవంతం వాడ కు చెందిన హిందూ బంధువులు ఈ సమ్మేళనం లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం సాయంత్రం 6 గం లకు కట్ట పోచమ్మ చెరువు కింద శివాజీ గ్రౌండ్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు. టూ టౌన్ పుర ప్రముఖులు, హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థలు, ధార్మిక సంస్థలు, కలుపుకొని ప్రతిఒక్కరు హిందూ సమ్మేళనం కార్యక్రమం విజయవంత చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు సంతోష్ సంగర్కర్,పర్వతాల నర్సయ్య,దెబ్బట శంకర్,మోహన్ రెడ్డి, సదానందం,సాగిరే సంతోష్, నాగవెల్లి శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

# అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

**- జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు,ప్రత్యేక తనిఖీలు మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 15,(విజన్ ఆంధ్ర ) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మంచిర్యాల జోన్ పరిధిలోని గోరక్షక్ సభ్యులతో మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో పశువుల అక్రమ రవాణా నిరోధంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల గురించి డీసీపీ వివరించారు. డీసీపీ మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా గోరక్షక్ సభ్యులతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల ప్రకారం ఆవులు, దూడలను వధించడం నిషేధించబడిందని పేర్కొన్నారు. అలాగే పశువులు లేదా ఇతర మూగజీవాలను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించే సమయంలో వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్,కౌస్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షక్ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే రామగుండం పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597, డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. పశువుల రవాణాకు సంబంధించి వెటర్నరీ డాక్టర్ ఆమోదించిన ధ్రువపత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ఏడు శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ప్రధాన రహదారులతో పాటు పక్క రాష్ట్రాలు, పక్క జిల్లాల నుంచి వచ్చే మార్గాల్లో సుమారు 15 ఆకస్మిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టం ప్రకారం పశువుల అక్రమ రవాణాను అరికట్టడం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజలు, గోరక్షక్ సభ్యులందరి బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఎవరికైనా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మంచిర్యాల జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. వాహనాల్లో తరలిస్తున్న పశువుల వివరాలు,వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ వివరాలు,ఫోటోలు తీసి ప్రత్యేక గ్రూపుల్లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. మంచిర్యాల జిల్లా పారిశ్రామిక ప్రాంతం అనేక ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పిస్తోందని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ కలిసి జీవిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ,సామరస్య వాతావరణం కొనసాగించడంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు,మీడియా మిత్రులు అందరి సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించి సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, మంచిర్యాల రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లక్సెట్టిపేట్ సీఐ రమణమూర్తి, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్,మంచిర్యాల జోన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి

**టీవీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 15,(విజన్ ఆంధ్ర ): ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ శుక్రవారం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు కష్టపడి సిద్ధమైన నీట్ పరీక్షల విశ్వసనీయత కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా దెబ్బతిందని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఈ ఘటనకు కేంద్ర విద్యాశాఖతో పాటు సంబంధిత మంత్రి పూర్తి బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతిష్ట దెబ్బతిందని, విద్యార్థుల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మళ్లీ నమ్మకం కలిగించేలా ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, పరీక్షల నిర్వహణలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రంజిత్, తరుణ్, కుమారస్వామి తదితరులున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు కృషి చేయాలి

**- పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది,**
**- ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి,**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) మే 13 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ సర్పంచులు, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ సభ్యులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని డీ.కేఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో, విద్యా వారోత్సవాల్లో భాగంగా, విద్యాభివృద్ధిపై అవగాహన సదస్సులో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, శాసన మండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి హాజరయ్యారుకార్యక్రమాన్ని సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ప్రత్యేకచర్యలుతీసుకుంటున్నట్లు, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు చొరవ చూపినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లాకలెక్టర్అభిప్రాయపడ్డారు. ప్రతి సర్పంచ్, వార్డు సభ్యుడు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధి ద్వారా మాత్రమే సమాజ అభివృద్ధిసాధ్యమవుతుందని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల పట్ల పూర్తి అవగాహన కల్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచేలా సర్పంచులు కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల ఆకర్షణలో పడి ఆర్థికంగా దెబ్బ తినడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తులను నాశనం చేసుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యా అందుతుందని అందుకు అనుగుణంగా సర్పంచులు పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారిఏరమేష్కుమార్మాట్లాడుతూ. జిల్లా విద్యా రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలు, రెండు జతల ఏకరూపదుస్తులు అందజేయడంతో పాటు, విద్యార్థుల అభ్యున్నతికి చేపడుతున్న చర్యలు, పదో తరగతిలో సాధించిన ఫలితాలపై వివరించారు. విద్యార్థుల నమోదు పెంపు, మధ్యాహ్న భోజన పథకం అమలు, డిజిటల్తరగతులు, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో పాల్గొన్న సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు తమ గ్రామాలు, వార్డుల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ల శెట్టి, నియోజకవర్గ పరిధిలోని మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు

**- యువతకు ఆహ్వానం పలికిన రవి పటేల్**



భూపాలపల్లి జిల్లా మే 15 (విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి రూరల్ పరిధిలోని టేకుమట్ల మండలం గరిమెళ్లపల్లి, కలికోటపల్లి గ్రామాల నుండి పెద్ద ఎత్తున యువత తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరుపేద ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం వంటి అంశాలను కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ప్రజల పక్షాన నిలబడి రాజకీయాల్లో ఒక పెద్ద మార్పు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని బహుజన ప్రజలంతా పార్టీకి అండగా నిలుస్తున్నారని, ఈరోజు పార్టీలో చేరిన ప్రతి యువకుడు మరో 100 మందిని ప్రభావితం చేస్తూ భూపాలపల్లిలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ విధి విధానాలకు కట్టుబడి, పార్టీ ఆదేశాలను పాటిస్తూ ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీసి పేద ప్రజల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పుప్పాల శ్రీను, దాసరపు వంశీ, దాసరపు శ్రావణ్, కొలనీ రమేష్‌లను రవి పటేల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, కొత్త మహేష్‌తో పాటు పార్టీ గ్రామ కమిటీ కార్యకర్తలు, నాయకులు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టాస్క్ అధ్యర్యంలో ప్రత్యేక శిక్షణ కోసం యువతీ యువకులకు ఆహ్వానం.




భూపాలపల్లి జిల్లా మే 15 ( విజన్ ఆంధ్ర ) జిల్లా లోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి ,శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టాస్క్ ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జయ శంకర్ విగ్రహం వద్ద సింగరేణి ఏరియా వర్క్ షాప్ పక్కన ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో కంప్యూటర్ బేసిక్స్,కమ్యూనికేషన్ స్కిల్స్,అర్థమేటిక్ & రీజనింగ్, జ లాంగ్వేజ్ , జావా, వెబ్ డిజైనింగ్ ,ట్యాలీ, డేటా బేస్, ఆటో క్యాడ్ వంటి అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈశిక్షణలతో యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అలాగే ప్లేస్మెంట్ డ్రైవ్స్, జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి, స్టార్టప్లకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని ప్రస్తుతం కొత్త బ్యాచ్ ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని అంతే కాకుండా క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్లైన్ లో కూడా రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 8074031962ను సంప్రదించాలని వారు సూచించారు.

# కొత్తగూడెం ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు

**- 2026-27 ఉత్పత్తి లక్ష్య సాధనపై సమీక్ష**



కొత్తగూడెం బ్యూరో, మే 16(విజన్ ఆంధ్ర) : కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో శుక్రవారం మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ (ఎండీటీ) సమావేశం నిర్వహించారు. సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగుల భద్రతా ప్రమాణాలు, సంస్థ ముందున్న సవాళ్లు, నాణ్యమైన బొగ్గు సరఫరా తదితర అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థ వ్యాప్తంగా 680 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం ఏరియాకు 22.50 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని కేటాయించారని, అందులో పీవీకేకు 2.50 లక్షల టన్నులు, వీకేసీఎంకు 20 లక్షల టన్నుల లక్ష్యాలు ఉన్నాయని వివరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి అన్ని గనులు, విభాగాల్లో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ సమావేశాలు నిర్వహించి అధికారులు, ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి భద్రతతో కూడిన వార్షిక లక్ష్య సాధనకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఎండీటీ సమావేశాల షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. మే 18న పీవీకే-5 ఇంక్లైన్ గనిలో మొదటి, రెండో షిఫ్టుల్లో సమావేశాలు నిర్వహించనుండగా, మే 21న జీఎం కార్యాలయంలో సమావేశం జరగనుంది. మే 22న వీకేసీఎం, ఏరియా స్టోర్, సివిల్, ఎస్&పీసీ, ఎంవీటీసీ, ఆర్డీపీ డిస్పెన్సరీల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. మే 23న ఆర్‌సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లలో సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, డీజీఎం (ఐఈడీ) యోహన్, ఏజీఎం (ఫైనాన్స్) బీబత్స, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు, డీజీఎం (ఈ&ఎం) క్రిస్టోఫర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఆర్‌సీహెచ్‌పీ ఇంచార్జ్ ఆజ్మీరా శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు, వివిధ విభాగాల అధికారులు, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పట్టణ పీఠం ఎవరికి దక్కేనో..?

- రేసులో 10 ఏండ్లు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు ..
- వివిధ పార్టీలు మారినా పలువురు నాయకులు..
- పేట యువ నాయకుడి చూపు పార్టీలు మారిన వైపా..?
- పార్టీ కోసం 10 ఏండ్లు కష్టపడ్డవారి వైపా..?
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ..
- ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆశావహులు..

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుల నియామకం ఆ పార్టీలో దుమారం రేపుతుంది. ఇరవై ఏండ్లుగా పార్టీ కోసం పని చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న వారు.. పట్టణ పదవి ఆశిస్తున్నారని, వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అవకాశం ఇస్తే కొంతమంది కార్యకర్తలు సహించేది లేదని గుసగుసలాడుతున్నారు. భజన చేసే వారికి కాకుండా పార్టీ కోసం పనిచేసే వారికే పట్టణ అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు..**




సూర్యాపేట మే 15:(విజన్ ఆంధ్ర)

సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కొద్ది సంవత్సరాలుగా దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి వర్గాలుగా విడిపోయిన విషయం విదితమే. తాజాగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్వర్గీయులు అయిన తర్వాత పటేల్ రమేష్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి ఒకే తాటిపై వచ్చి మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేశారు.. కొంతమంది ఒంటెత్తు పోకడలతో ఎంతో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ సూర్యాపేటలో వరుసగా ఓటమి పాలవుతోందన్నారు. ఇకపై ఇలాంటి సందర్భాలు రాకుండా సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్టు సాధించడం కొరకు దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి గుడిపాటి నరసయ్య పార్టీ కోసం 20ఏండ్లు పనిచేసిన వ్యక్తి కాబట్టి అతనికి ఇప్పించారు. అలాగే తండ్రికి తగ్గ తనయుడిగా యువ నాయకులు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నూతన జిల్లా కమిటీల్లో చురుగ్గా పనిచేసే నాయకులకు పదవులను కట్టబెట్టారు. అదేవిధంగా సూర్యాపేట పట్టణ కమిటీలో కూడ అధ్యక్ష పదవి నిబద్ధతతో ఉండి పార్టీలు మారకుండా పార్టీ కోసం కష్టకాలంలో 10 ఏండ్లు పనిచేసిన కార్యకర్తలకు పదవులు అందిస్తారనే ధైర్యంతో కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపై నాయకత్వం ఫోకస్ పెట్టింది. పట్టణ కాంగ్రెస్ పార్టీ, అనుబంధ విభాగాలను బలోపేతం చేసేందుకు దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లా కమిటీ అధ్యక్షుల ఎంపిక పూర్తయింది. తాజాగా పట్టణ అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నట్లు వినిపిస్తున్నాయి .ప్రస్తుత అధ్యక్షుడు,సహా పలువురు సీనియర్ నాయకులు అధ్యక్ష పీఠం కోసం పోటీ పడుతున్నారు. కొత్తగా పార్టీలు మరి వచ్చిన నాయకులు ఎలాగైనా అధ్యక్ష పదవి దక్కించుకోవడానికి యువ నాయకులు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తుంది.. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గంలో గత మునిసిపల్ ఎన్నికల్లో అఖండ విజయం అందుకుంది. గత నియోజకవర్గ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పట్టణంలో పట్టు కోల్పోయిందని ఇప్పుడు ఉన్న ఉత్సాహంతో సంస్థాగతంగా పట్టణంలో పార్టీని పటిష్టపరిచేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎవరు..? అనే ఉత్కంఠ కొనసాగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగస్వామ్య కాంగ్రెస్ పార్టీ కావడం, ఆ పీఠం కోసం పలువురు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్ఠానం పరంగా చూస్తే పార్టీకోసం కష్టపడిన వారికి సీనియర్లకు రాష్ట్రమంతటా ప్రాధాన్యం ఇస్తుంది. పట్టణంలో కార్యకర్తలతో పాటు జిల్లా ముఖ్య నాయకులు, సీనియర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లే నాయకుడికే పట్టణ అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రయత్నిస్తోంది.

### అధ్యక్ష పీఠం కోసం తీవ్ర పోటీ..

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పీఠం కోసం తీవ్ర పోటీ ఉంది. ఆశావహులు ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు పది మంది నేతలు ఈ పదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు మైనార్టీ నాయకులు అంజద్ అలీ కాంగ్రెస్ పార్టీని పట్టణంలో 10 ఏండ్లు దివంగత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి గెలుపు కోసం పట్టణంలో కార్యకర్తలను ఒకే పట్టు మీద అందరినీ సమన్వయం చేసుకుంటూ ఉన్నానని యువ నాయకుడు సర్వోత్తమ్ రెడ్డి మరోసారి తనకే అవకాశం ఇస్తారని ఆశగా ఉన్నారు. బీసీ గౌడ కులానికి చెందిన సీనియర్ నాయకులు పోలగాని బాలుగౌడ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాంరెడ్డి దామోదర్ రెడ్డి వెంట ఉంటూ ఆయన గెలుపు కోసం ఎంతో కృషి చేశారని దామన్న కు ఎంతో విశ్వాస ప్రియుడుగా ఉన్న వ్యక్తి అని అతని అనుచరులు అంటున్నారు. ఇప్పుడు అతని తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వెంట చురుగ్గా పార్టీ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పార్టీ కోసం పదేళ్లు పనిచేసిన కార్యకర్తలకు



పట్టణ పదవి అందిస్తారని సీనియర్ నాయకులు కోరుకుంటున్నారు..పోలగాని బాలు గౌడ్ స్వర్గీయులు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ దాదాపు 10 ఏళ్లకుపైగా పార్టీలో ఉన్నా 2014 నుంచి కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు. పార్టీ అంటే ప్రాణం పెట్టే వారికి కష్టకాలంలో అండగా నిలబడ్డ వారికి టిఆర్ఎస్ పెట్టిన అక్రమ కేసులు దాడులకు,అరెస్టులకు భయపడకుండా విరోచితంగా పోరాడిన వారికి పార్టీ జెండానే దైవంగా భావించిన అసలు సిసల నాయకులు కార్యకర్తలకు విద్యావంతుడు యువ నాయకుడు అగ్ర ప్రాధాన్యమిస్తాడా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. పట్టణ కార్యవర్గం ఎంపిక కావాలంటే గత 10ఏండ్లలో పార్టీ కోసం ఏమి చేశారనేది ప్రతిపాదికగా తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించింది. పదవులు అడిగే వారి బయోడేటాలో 2015 నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం ఏం చేశారో చెప్పాలని గతంలో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేసినట్టు ఇంచార్జి మంత్రులు, పార్టీ వర్గాలు తెలిపారు. పార్టీ కోసం ఎంతో కాలంగా కష్టపడిన వారిని గుర్తించి పదవులు ఇస్తే తిరిగి పని చేస్తారని సీనియర్ నాయకులు భావిస్తున్నారు. పట్టణాన్ని సమర్థవంతంగా నడిపించే నాయకునికి పట్టణ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి కాంగ్రెస్ను నిలబెట్టిన కార్యకర్తలను పక్కనపెట్టి ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన నాయకులకు పదవులు ఇవ్వకూడదని, పార్టీని నమ్ముకుని ఎన్నో కష్టాలు పడ్డారు కానీ ఇప్పుడు పదవులు మాత్రం కొత్తగా వచ్చిన వారికి ఇస్తారేమో అని పలువురు క్షేత్రస్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న కొత్త నాయకుల పేర్లు ముందుకు రావడంతో పాత కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొంది. చేరికలను ప్రోత్సహించడం మంచిదే కానీ సంవత్సరాలుగా పార్టీ జెండా మోసిన వారిని విస్మరించకూడదు అని సీనియర్ కార్యకర్తలు సూచిస్తున్నారు. అదే క్రమంలో కొంతమంది పట్టణ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెంజరాపు రమేష్, వెలుగు వెంకన్న, అబ్దుల్ రహీం,అయూబ్ ఖాన్,శనగాని రాంబాబు కూడా పోటీ పడుతున్నారు. అబ్దుల్ రహీం,అయూబ్ ఖాన్ సీనియర్ నాయకులు గతంలో కాంగ్రెస్ పార్టీలో పదవులు స్వీకరించారు. కొంతమంది బి ఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడంతో పార్టీలో చేరి వారి హయాంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడంతో పార్టీలు మారి మళ్ళీ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న మరోసారి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఇక్కడ వినిపిస్తున్నది. కొత్తగా చాన్స్ ఇవ్వాల్సి వస్తే ఆ పదవికి వారు ఏ మేరకు న్యాయం చేస్తారన్న ఆలోచన అధిష్టానం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరుకుంటున్నారు. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని రోజు పార్టీలో ఐదేళ్లుగా ఉన్న వారికే అవకాశం ఇవ్వాలనే నిబంధనతో వారిని పక్కనే పెట్టే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. ఎవరికి వారు అధ్యక్ష పదవి తమకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. దీంతో స్థానిక రాజకీయ ముఖ చిత్రం ఒక్కసారిగా మారిపోయింది. పట్టణ కమిటీ నియమాకాల అంశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుంది అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీలు మారకుండా పార్టీ కోసం కష్టపడ్డ వారికి పట్టణాన్ని సమర్థవంతంగా నడిపించే నాయకునికి పట్టణ పదవి ఇవ్వాలని నాయకులు,కార్యకర్తలు కోరుతున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పై సీపీఐ నిరసన

- ప్రదర్శన, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం



ఖమ్మం జిల్లా బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర) : పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఖమ్మం సిపిఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆటోను తాళ్లతో లాగి నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు సురేష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా ధరలు పెంచబోమని హామీ ఇచ్చిన మోడీ హామీలో తుంగలో తొక్కి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని రానున్న కాలంలో నిత్యావసర వస్తువుల ధరలను మరింతగా పెంచనున్నారని అన్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మోడీ సర్కార్ కేవలం సంపన్న వర్గాల కోసం మాత్రమే -పని చేస్తుందని యావత్ దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రో ధరల పెరుగుదల సామాన్యులకు మరింత భారం కానుందన్నారు. రవాణా ఛార్జీలు పెరిగి ఇతరత్రా కూడా అదనపు భారం కానుందన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. మోడీ మాయ ఎంతో కాలం ఈ దేశంలో నిలబడలేదని ప్రజలు వాస్తవికతను అర్థం చేసుకుంటున్నారని సురేష్ తెలిపారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు తాటి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, పోటు పూర్ణ, జ్వాలా నర్సింహారావు, మందా వెంకటేశ్వర్లు, ఉపేందర్, చార్లెస్, బెజవాడ వెంకన్న, నర్సింహారావు రమణయ్య, లడ్డు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

- రైతులకు ఇబ్బందులు కలుగొద్దు..
- కొనుగోలు చేసిన మక్కలను గోదాంకు వెంట వెంటనే తరలించాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 15.జమ్మికుంట మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు మక్కల కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన మక్కల బస్తాలను వెంటవెంటనే గోదాంలకు తరలించి భద్రపరచాలని సూచించారు. శుక్రవారం జమ్మికుంట మార్కెట్ యార్డులోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం రోజుకు ఎన్ని క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేస్తున్నారు. గన్ని బ్యాగుల కొరత ఉందా, రవాణా ప్రక్రియ ఎలా జరుగుతోందనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల కష్టం పంట రూపంలో వస్తుందని, అందువల్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. లోడ్ చేసిన బస్తాలను వెంటనే గోదాంలకు తరలించాలని, గోదాంలో నిల్వ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ యార్డు పక్కన ఉన్న గోదాంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో స్టోర్ చేస్తున్న మక్కల బస్తాల నిర్వహణను పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియను సమన్వయం తో నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి బస్తాను సురక్షితంగా గోదాంలో భద్రపరచాలని, ఎప్పటికప్పుడు లిఫ్టింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న, హుజురాబాద్ ఆర్డీవో కే రమేష్ బాబు, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహమ్మద్ షహబుద్దీన్ తహసిల్దార్ వెంకటరెడ్డి తో పాటు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమాజం ముందుకు రావాలి

- బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు
- ప్రతి గ్రామంలో బాలల హక్కుల కమిటీలు ఏర్పాటు చేయాలి
- చదువుతోనే పిల్లల భవిష్యత్తు ఉజ్వలం
- బాలల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి : సీతా దయాకర్ రెడ్డి
- పిల్లల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఆది శ్రీనివాస్
- బాలల హక్కుల రక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 15 (విజన్ ఆంధ్ర): బాలల హక్కుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీత దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్త్రీ, మహిళా, శిశు, వృద్ధుల, దివ్యాంగులు మరియు ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, "పిల్లల రక్షణ.. సమాజం బాధ్యత" అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కిశోర బాలికలకు ఉపాధి శిక్షణలో భాగంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం, వార్డులో బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో డ్రాప్‌ఔట్లు లేకుండా చూడాలని, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, వ్యాక్సినేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మగ, ఆడ పిల్లలకు సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతో విద్యా రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పిల్లలు చదువు మానేయకుండా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి గ్రామం, వార్డులో బాలల హక్కుల కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకం కింద అనాథ పిల్లలకు ప్రతి నెల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. పిల్లల దత్తత చట్టబద్ధంగా మాత్రమే జరగాలని సూచించారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ బాల కార్మిక నిర్మూలన కోసం "ఆపరేషన్ ముస్కాన్" నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీమ్స్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై గట్టి నిఘ..

భూపాలపల్లి జిల్లా, రేగొండ, మే 15 (విజన్ ఆంధ్ర)బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లింల కు మధ్య దళారులు అక్రమంగా పశువులను విక్రయిస్తారని ఉద్దేశంతో రేగొండ ప్రభుత్వ వైద్యశాల వద్ద పరకాల- భూపాలపల్లి ప్రధాన రహదారిలో రేగొండ ఎస్సై డి.సుధాకర్ అద్వర్యంలో చెక్పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, ఘన్పూర్ సిఐ కరుణాకర్ రావులు చెక్ పోస్ట్ ను పరిశీలించారు. అధికారులకు తగిన చూసినట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్ పోస్ట్ వద్ద పోలీస్ సిబ్బంది పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పశువులను రవాణా చేయదలచుకున్న వ్యక్తులు కచ్చితంగా సరియైన పత్రాలు కలిగి ఉండాలని లేనియెడల కేసులు నమోదు చేసి పశువులను గోచాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని వేరే సంఘాల వ్యక్తులు తనిఖీలు చేయడం ఆపడం లాంటి పనులు చేయడం తప్పిదంగా భావించడం జరుగుతుందని అలాంటి వ్యక్తులు పోలీస్ వారికి సమాచారాన్ని చేరవేసిన వేళ మేమే వారిపై చట్టరితే చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.




### వరంగల్ జిల్లాలో మక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి మే16(విజన్ ఆంధ్ర); జిల్లాలో మక్కజొన్నకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించిన నేపథ్యంలో రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,07,991 ఎకరాల్లో మక్క సాగు చేయబడిందని, సుమారు 3,77,969 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 97191.350 స మెట్రిక్ టన్నుల మక్కజొన్న కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. సుమారుగా 19,099 రైతులనుండి సుమారుగా 233.25 కోట్ల రూపాయల మొక్క జొన్నలు సేకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, నీడ, తేమ పరీక్షలు, తరలింపు



సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను సరైన నాణ్యతతో తీసుకురావాలని సూచించారు .మక్కజొన్న కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించినట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.